## ఎమ్మెల్సీ నివాసంలో ప్రజాదర్బార్

పులివెందుల, అక్టోబరు 1, ప్రభాతవార్త ః



పులివెందులలోని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి తన నివాసంలో మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రజలు ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి నివాసానికి చేరుకుని పలు సమస్యలపై విన్నవించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని, తప్పకుండా మీ సమస్యలు పరిష్కరిస్తామని పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంచి ఆలోచనతో రాష్ట్రాన్ని ప్రగతి వైపు నడిపిస్తున్నాడని, అందులో భాగంగా మనం కూడా ఆయన ఆశయాలను అనుగుణంగా నడుచుకోవాలని ఎమ్మెల్సీ తెలిపారు. ఈ ప్రాంత ప్రజల కష్టసుఖాల్లో మా వంతు భాగస్వాములు అవుతామని తప్పకుండా మీ సమస్యలు పరిష్కరిస్తామని రామగోపాల్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ తూగుట్ల మధుసూదన్‌రెడ్డి, మైనూరారెడ్డి, బాబు (పటాల అంగడి), తదితరులు పాల్గొన్నారు.


# వైఎస్ఆర్-అన్నమయ్య

తెలుగు జాతీయ దినపత్రిక

# వార్త

బుధవారం 02 అక్టోబర్ 2024


## కబడ్డీలో రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు

గాలివీడు, అక్టోబర్ 1(ప్రభాతవార్త):

కబడ్డీ జిల్లా స్థాయి పోటీలలో మంగళవారం రామాపురంలోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో జరిగిన పోటీలలో గాలివీడు బాలుర ఉన్నత పాఠశాల 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సందీప్, శ్రీహరి కృష్ణలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల పిడి గంగరాజు తెలిపారు. ఈ విద్యార్థులు త్వరలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం అభినందించారు.





# విద్యార్థులకు ఆటలతో ఆరోగ్యం.. మనోవికాసం

రాయచోటి, అక్టోబరు 1, ప్రభాతవార్త:

విద్యార్థులకు ఆటలు ఆరోగ్యంతో పాటు మనో వికాసాన్ని కలిగిస్తాయని రవాణా, యువజన క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా పరికరాల పంపిణీ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు మదితాటి నరసింహారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ పిల్లలకు నిత్యం కనీసం ఒక అరగంట నుంచి గంట పాటైనా ఆటలు ఆడించాలన్నారు. క్రీడలకు అవసరమైన మౌలిక సదుపాయాలను కల్పిస్తాయన్నారు. రాయచోటిలో క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేయడమే కాకుండా ఇండోర్ గేమ్స్ సదుపాయాలను కల్పిస్తామన్నారు. క్రీడలలో ప్రతిభ చూపిన వారికి విద్య, ఉద్యోగ అవకాశాలు రిజర్వేషన్ సౌకర్యం కలదన్నారు. ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు అవార్డు పొందిన దేవప్రసాద్‌రెడ్డిని దుశ్శాలువాతో సత్కరించారు. ఏకలవ్య ఫౌండేషన్, చెకుముకి, స్వర్ణాంధ్ర విజన్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు నాగేశ్వర నాయుడు, శశిధర్ రెడ్డి, గోపాల్, ఓబీసీ మోర్చా జిల్లా ప్రెసిడెంట్ రేపన శివప్రసాద్, ఎన్నారై భూషణ్ శశివర్మ, మాజీ జడ్పీటీసీ నరసారెడ్డి, మాజీ ఎంపీటీసీ శివప్రసాద్‌రెడ్డి, తెదేపా నాయకులు కొండా భాస్కర్‌రెడ్డి, గొల్లపల్లి సుబ్బారెడ్డి, పాఠశాల విద్యా కమిటీ ఛైర్మన్‌లు రెడ్డిరాణి, రెడ్డి మోహన్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్టీసి బస్సు-లారీ ఢీ...24మందికి గాయాలు

బాధితులను పరామర్శించిన ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్‌లు



కురబలకోట, అక్టోబర్ 1 ప్రభాతవార్త :

ఆర్టీసి బస్సు, లారీ ఢీ కొనడంతో 24మంది ప్రయాణికులు గాయపడిన సంఘటన కురబలకోట మండలం సర్కారుతోపు వద్ద మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలావున్నాయి. మదనపల్లె వైపు వస్తున్న ఆర్టీసి బస్సు డివైడర్‌ను దాటుకొని మదనపల్లెనుంచి కదిరివైపుకు వెలుతున్న లారీని సర్కారుతోపు వద్ద ఢీ కొంది. ఈ ప్రమాదంలో బస్సులోని 24మంది ప్రయాణీకులు గాయపడ్డారు. మదనపల్లె మండలం రెడ్డివారిపల్లెకు చెందిన వెంకటసుబ్బయ్య, పెద్దపంజాణి మండలంకు చెందిన లక్ష్మన్న, పెద్దమండ్యంకు చెందిన స్వాతి, గుర్రంకొండకు చెందిన గిరిబాబు, గాలివీడుకు చెందిన రమాదేవి, పెద్దమండ్యంకు చెందిన షాహీనా, సురేంద్ర, అంగళ్ళుకు చెందిన నందిని, తంబళ్లపల్లెకు చెందిన మనోజ్‌కుమార్, మదనపల్లెకు చెందిన సురేష్‌కుమార్, పార్వతమ్మ, సిటిఎంకు చెందిన శ్రీరాములురెడ్డి, కురబలకోటకు చెందిన స్పందన, పెద్దమండ్యంకు చెందిన పద్మజ, మదనపల్లెకు చెందిన రెడ్డిశేఖర్, తంబళ్లపల్లెకు చెందిన ఖాదర్‌వల్లీలు గాయపడ్డారు. ఆర్టీసి కండక్టర్ ఎ.బి.సురేష్, ఆర్టీసి డ్రైవర్ రామక్రిష్ణలు తీవ్రంగా గాయపడడంతో ప్రథమ చికిత్సలు అనంతరం వైద్యులు మెరుగైన చికిత్సల నిమిత్తం తిరుపతికి రెఫర్ చేశారు. ఈ సంఘటనను మదనపల్లె సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్, ఎమ్మెల్యే షాజహాన్‌బాషా, మదనపల్లె డిఎస్‌పి కొండయ్యనాయుడు ఆసుపత్రిలో బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. సంఘటన వివరాలపై పోలీసులను అడిగి ఎమ్మెల్యే, సబ్‌కలెక్టర్‌లు విచారించారు. ముదివేడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఈ సంఘటనతో ముంబై, చెన్నై రహదారిలో ట్రాఫిక్ స్తంభించింది. పోలీసులు ట్రాఫిక్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టారు.



## కట్టిగుత్తిపల్లిలో తాగునీటి బోరును ప్రారంభించిన మంత్రి

రాయచోటి, అక్టోబరు 1, ప్రభాతవార్త:



సంబేపల్లి మండలం కుట్టిగుత్తిపల్లిలో సీఎం కొత్తపల్లిలో మంగళవారం తాగునీటి బోరును రాష్ట్ర రవాణా క్రీడాశాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి ప్రారంభించారు. ఇబ్బందులు పడుతున్న ప్రజల సమస్యలు తెలుసుకున్న మంత్రి మండిపల్లి కట్టిగుత్తిపల్లిలో తాగునీటి బోరు ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు. మంగళవారం అధికారులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, ఇన్‌ఛార్జి ఈవోపీఆర్డీ సునీల్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ, మండల నాయకులు నరసారెడ్డి, నాగేశ్వర్‌నాయుడు, మండల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న బోరు వాహనం

- గోపిదిన్నె పోస్టుమాస్టర్ మృతి - అనాథలుగా పిల్లలు

తంబళ్లపల్లె, అక్టోబరు 1, ప్రభాతవార్త:





ఓ బోరు వాహనం ములకల చెరువు రహదారి నుంచి తంబళ్లపల్లె వైపు వస్తూ ఉన్న ఓ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో గంగిరెడ్డిపల్లెకు చెందిన మధుకర్ నాయుడు(42) మృతి చెందాడు. ఈయన గోపిదిన్నె అసిస్టెంట్ స్టేషన్ మాస్టర్‌గా పనిచేస్తున్నాడు. మంగళవారం యథావిధిగా తన విధులు ముగించుకొని తన స్వగ్రామం గంగిరెడ్డిపల్లెకు తంబళ్లపల్లె మీదుగా ద్విచక్ర వాహనంలో వెళ్తుండగా ఈ ప్రమాదం సంభవించింది. దీంతో ఆయన కుటుంబ సభ్యుల రోదనలతో ఆ ప్రాంతం శోకసంద్రంగా మారింది. ఆయన మృతితో వారి పిల్లలు అనాథలుగా మారారు. మధుకర్ నాయుడు మృత్యువాత పడిన విషయం గంగిరెడ్డిపల్లెలో తెలియడంతో ఆ గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి. వారి పిల్లలు జస్వంత్, మధుకర్‌లను అన్ని విధాలా ఆదుకోవాలని స్థానిక ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## తిరుమల లడ్డులో కల్తీ జరిగిందనడం కేవలం రాజకీయమే

జమ్మలమడుగు, అక్టోబరు 1, ప్రభాతవార్త:



ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక తిరుమల తిరుపతి వెంకటేశ్వరస్వామి పవిత్ర ప్రసాదమైన తిరుమల లడ్డులో కల్తీ జరిగేందని చెప్పడం కేవలం రాజకీయ కుట్రేనని జమ్మలమడుగు ఎమ్మెల్సీ పొన్నపురెడ్డి రామసుబ్బారెడ్డి పేర్కొన్నారు. మంగళవారం జమ్మలమడుగు పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దశాబ్దాల రాజకీయ అనుభవం మరియు నాలుగు సార్లు సీఎం పదవి చేపట్టిన చంద్రబాబునాయుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం తగదని ఇది చాలా బాధకరమైన విషయని రామసుబ్బారెడ్డి తెలిపారు. పంది కొవ్వు, వెజిటబుల్ నూనెలు కలిపి తయారు చేస్తున్నారని చెప్పడం వల్ల ప్రపంచంలో ఉండే వెంకటేశ్వర స్వామి భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. వంద ఏళ్లుగా జరుగుతున్న తిరుమల లడ్డు తయారీలో ఎప్పుడు లేని దారుణమైన అపవాదులు రావడం బాధాకరమన్నారు. ఒకటి సార్లు తిరుమల లడ్డు తయారీకి వచ్చే నెయ్యిని పరీక్షించిన తరువాతే లడ్డు తయారీ కేంద్రానికి తరలిస్తారని ఇలాంటి పటిష్ట వ్యవస్థ కలిగిన తిరుమల లడ్డు తయారీపై కల్తీ జరిగిందని ఈనాడు, జ్యోతి వంటి పత్రికల్లో వార్తలు రావడం హేకరమైన చర్య అన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని పవిత్ర తిరుమల లడ్డు కల్తీ జరిగిందని చెప్పడంపై భారత అత్యున్నత న్యాయస్థానం ప్రశ్నించడంతో ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకొని పవిత్ర తిరుమల లడ్డు వివాదంపై చేసిన వ్యాఖ్యలు చంద్రబాబు నాయుడు వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఏదైనా మాట చెప్పేటప్పుడు ఒకటి 10 సార్లు విచారించాలని ఎంతో పవిత్రత కలిగిన తిరుమల వెంకటేశ్వర స్వామి లడ్డులో కల్తీ జరిగిందని చెబితే భక్తుల మనోభావాలు దెబ్బతింటాయని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో వైసీపీ సీనియర్ నాయకులు పొన్నపురెడ్డి గిరిధర్‌రెడ్డి, శ్రీనివాసులురెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## కూటమి ప్రభుత్వంలోనూ జగన్ చిత్రాలు

పట్టించుకోని తెలుగు తమ్ముళ్లు

ఖాజీపేట, అక్టోబర్ 01, ప్రభాతవార్త:




బిజెపి, జనసేన, టీడీపీ నేతృత్వంలో ఏర్పడ్డ కూటమి ప్రభుత్వంలోనూ ప్రభుత్వ భవణాల పైన జగన్ చిత్రాలను చూసి ప్రజలు ఆశ్చర్యపోతున్నారు. ప్రభుత్వ భవణాలపై జగన్ చిత్రాలను చూసిన తెలుగు తమ్ముళ్లు సైతం పట్టి పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. ఖాజీపేట మండలం కూనవారిపల్లి పంచాయతీ పరిధిలో వైకాపా ప్రభుత్వ హయాంలో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా, ఆరోగ్య కేంద్రం కార్యాలయాలపై నవరత్నాల పేరుతో జగన్ చిత్రాలను ఏర్పాటు చేశారు. అయితే సార్వత్రిక ఎన్నికలలో వైకాపా ప్రభుత్వం ఓడిపోయి కూటమి నేతృత్వంలో 161 సీట్లతో ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రభుత్వం ఏర్పాటుచేసి నాలుగు మాసాలు కావస్తున్న కూనవారి పల్లెలో కార్యాలయాలపై మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రాలు మాత్రం తొలగించలేదు. పార్టీ ఆవిర్భావం నుంచి మేము తెలుగుదేశం పార్టీలో ఉంటున్నాం అంటూ చెప్పుకునే తెలుగుదేశం నాయకులతో పాటు నిత్యం పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయానికి వెళుతున్న తెలుగు తమ్ముళ్లు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పేరుతో వృద్ధులకు, వికలాంగులకు అందిస్తున్న పెన్షన్ కార్యక్రమం ప్రచారానికి మాత్రం మేము ముందంటూ ఫోటోలకు ఫోజులిస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రభుత్వ కార్యాలయాలపై మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి చిత్రాలను తొలగించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

## ఘనంగా ముందస్తు దసరా వేడుకలు

పులివెందుల, అక్టోబరు 1, ప్రభాతవార్త ః



పులివెందుల పట్టణంలోని నారాయణ పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా అమ్మవారి ప్రతిమను తయారు చేసి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు తొమ్మిదిమంది దేవతా వేషధారణలు ధరించి ఆహుతులను ఎంతగానో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏటీఎం కిరణ్ పాల్గొని దేవిమాతకు పూజలు చేసి మన సంస్కృతి, సంప్రదాయాల గురించి వివరించారు. దసరా పండుగ విశిష్టత గురించి తెలిపారు. భావితరాలకు మన సంస్కృతి, సంప్రదాయాల విలువ తెలిసేలా ప్రతి ఒక్కరు నడుచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఛాంప్స్ వైస్ ప్రిన్సిపల్ అంజనాదేవి, ఈకిడ్స్ వైస్ ప్రిన్సిపల్ శ్రావణి, హైస్కూల్ డీన్స్ భాస్కర్, త్రివేణి, తదితరులు పాల్గొన్నారు.

## అన్నా క్యాంటి న్‌ను పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్, అక్టోబర్ 1 (ప్రభాతవార్త):

పట్టణంలోని మైదుకూరురోడ్డులో ఉన్న అన్నా క్యాంటిన్‌ను మంగళవారం మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పరిశీలించారు. ఇందులో భాగంగా ఆయన పారిశుద్ధ్య కార్మికులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు. అక్కడి పరిశుభ్రత, పనితీరును ఆయన ప్రశంసించారు. అలాగే మిగతా రోజులలోనూ ఇలాగే మెయింటెన్ చేయాలని అక్కడి సిబ్బందికి సూచించారు.

## వాసవి అపార్ట్‌మెంటు డ్రైనేజీని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్

బద్వేలు అర్బన్, అక్టోబర్ 1 (ప్రభాతవార్త):



పట్టణంలోని చాంద్ థియేటర్ వద్ద వేసిన వెంచర్ గోడ కూలిపోవడంతో పాటు పంట కాలువలను కొంతమంది ఆక్రమించడంలో దగ్గరలో ఉన్న వాసవి అపార్ట్‌మెంటు వద్ద మురికినీరు నిలిచింది. దీనిని పరిశీలించిన మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ప్రజా ప్రతినిధుల సూచనల మేరకు నీరు నిల్వలేకుండా తొలగించాలని, ప్రజా రోగ్య సిబ్బంది సూచించారు. దీంతో కమిషనర్ పర్యవేక్షణలో జేసీబీతో పూడిక తీసీ నీరు ప్రవహించేలా చూడడంతో పాటు శాశ్వత పరిష్కారానికై చర్యలు చేపట్టారు. రెండు,మూడు రోజులలో సమస్య పరిష్కారమవుతుందన్నారు.

## సీఐ, ఎస్సై బాధ్యతలు స్వీకరణ

పీలేరు, అక్టోబరు 01 ప్రభాతవార్తః

పీలేరు ఎక్సైజ్ సీఐగా సీహెచ్ వెంకటసుబ్బారెడ్డి, ఎస్సైగా చైతన్య మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ సీఐగా పనిచేస్తున్న శ్యామ్‌ప్రసాద్ తిరుపతి టాస్కుఫోర్సుకు బదిలీపై వెళ్లారు. తిరుపతి ఎక్సైజ్‌లో పనిచేస్తున్న సీహెచ్ వెంకటసుబ్బారెడ్డి బదిలీపై పీలేరుకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న లక్ష్మీనరసయ్య రాయచోటికి బదిలీపై వెళ్లారు. ఆయన స్థానంలో పులిచెర్ల ఎస్సైగా పని చేస్తున్న బి.చైతన్య బదిలీపై పీలేరుకు వచ్చారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు తమ వంతు కషిచేస్తామని తెలిపారు.

## ప్రజా సమస్యలపై చట్టబద్ధంగా పోరాటం చేస్తాం

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి

ప్రొద్దుటూరు, అక్టోబర్ 01, ప్రభాతవార్త:



గత ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ప్రజలకు గాలి కబుర్లు చెప్పి అమలు చేయని సంక్షేమ పథకాలు అమలు చేసే వరకు చట్టబద్ధంగా పోరాటం చేస్తామని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఎన్నికలలో ఇచ్చిన అన్ని హామీలను తుంగలో తొక్కి చెడు వ్యసనాలకు అలవాటు పడే మద్యాన్ని మాత్రం 100రోజులలోనే సమీక్ష నిర్వహించి అమలు చేస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల్లో విద్యుత్ చార్జీలు నయా పైసా పెంచమని ప్రజలకు హామీ ఇచ్చి నేడు 20వేల కోట్లు ప్రజలపై భారం మోపేందుకు ప్రభుత్వం సిద్ధపడుతుందని అన్నారు. ఈ అంశంపై ప్రజలకు ప్రతిపక్ష నేతగా వివరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి సంవత్సరంనకు ఒక సారి ఒక యూనిట్ అయ్యే ఖర్చు, ఒక యూనిట్‌కు రాబడిన అంచనా వేసి అధికారులు యూనిట్ చార్జీలను నిర్వహిస్తారని తెలిపారు. కానీ 2014-19 చంద్రబాబు పాలనలో ఈ తరహా సిస్టం లేదన్నారు. 2024లో అధికారం చేపట్టిన టిడిపి విద్యుత్ చార్జీలను పెంచేందుకు సిద్ధపడుతుందన్నారు. విద్యుత్ చార్జీలను పెంచడంలో గత వైసీపీ ప్రభుత్వ పాత్ర లేదని, కొన్ని పత్రికలు బురదజల్లే ప్రయత్నం చేస్తుండటం విడ్డూరమన్నారు. ఒకవేళ విద్యుత్ చార్జీలు ప్రభుత్వం పెంచితే చట్టబద్ధంగా తీవ్రంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోగా చెడు వ్యసనాలకు లోనయ్యే మద్యాన్ని మాత్రం 100రోజులలోనే సమీక్ష నిర్వహించి ప్రభుత్వం అమలు చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. తల్లికి వందనం, ప్రతి మహిళకు 1500, ఉచిత గ్యాస్ సిలిండర్లు, ఉచిత బస్సు ప్రయాణం లాంటి పథకాలకు చరమగీతం పాడి చంద్రబాబు మరోసారి ప్రజలను మోసం చేసే దిశగా అడుగులు వేస్తున్నారని విమర్శించారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ప్రజా సమస్యలపై చట్టబద్ధంగా టిడిపి ప్రభుత్వంపై తీవ్రతరంగా ఉద్యమించేందుకు సిద్ధమవుతుందన్నారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షులు సానబోయిన శేఖర్‌యాదవ్, మున్సిపల్ చైర్పర్సన్ భీమునిపల్లె లక్ష్మిదేవి తదితరులు పాల్గొన్నారు.

## పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే

మదనపల్లె, అక్టోబర్ 1 ప్రభాతవార్త :

పేదల సంక్షేమమే ప్రభుత్వం ద్యేయంగా పనిచేసిందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. మంగళవారం నియోజకవర్గంలోని మున్సిపాలిటితో పాటు రూరల్ మండలం, నిమ్మనపల్లె, రామసముద్రం మండలాల్లో ఎమ్మెల్యే పెన్షన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ వృద్ధులు, వికలాంగుల సంక్షేమం కోసం గతంలో ఏ ప్రభుత్వం ఇవ్వని విధంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రూ.4వేలు పెన్షన్ ఇస్తున్నారన్నారు. దేశంలోనే అత్యధికంగా పెన్షన్‌లు ఇసున్న ప్రభుత్వం టిడిపినే అన్నారు. వృద్ధ్యాప్యంలో ఈ పెన్షన్ నగదు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అంతేకాకుండా అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. తెల్లవారిజామున 5గంటలకే పెన్షన్‌దారుల ఇళ్ళకు వెళ్ళి పెన్షన్‌లు ఇచ్చిన ఘనత టిడిపి ప్రభుత్వానిదే అన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపట్టేందుకు కూడా ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. మున్సిపాలిటి పరిధిలో కూడా పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ ప్రమీళ, తహశీల్దార్ ఖాజాబీ, సచివాలయ ఉద్యోగులు వివిధశాఖల అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



## కళాశాలలో ఫుడ్ ఫెస్టివల్

యర్రగుంట్ల, అక్టోబర్ 01, ప్రభాతవార్త:



మండల పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చిలమకూరు ప్లస్ నందు మంగళవారం ఇంటర్మీడియట్ విధ్యార్థినిలు ఫుడ్ ఫెస్టివల్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఇంటర్ విధ్యార్థులకు యూనిఫాం అందజేసిన దాత అయిన చంద్రశేఖర్ రెడ్డి ముఖ్య అతిధులుగా విచ్చేసి ఫుడ్ పెస్టివల్‌లో పాల్గొనడం జరిగింది. ఈ సంధర్భంగా దాద చంద్రశేఖర్ రెడ్డికి పాఠశాల తరపున చిరు సన్మానం చేసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ప్లస్ ఉపాధ్యాయులు అయిన చంద్రశేఖర్, సావిత్రమ్మ, సూర్యనారాయణ రెడ్డి, రామాంజనేయులు, డేవిడ్ రాజు, విమలకుమారి, చాంద్ బాష తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదమా.. హత్యా యత్నమా...

పెండ్లిమర్రి, అక్టోబరు 1, ప్రభాతవార్త:



వైవీయూ పరిధిలో సోమవారం రాత్రి వేంపల్లెలో పనిచేస్తున్న కానిస్టేబుల్ శ్రీనివాసులురెడ్డి వేంపల్లె నుంచి కడపకు వెళ్తుండగా రెండు కాళ్లు పూర్తిగా ఇరగడం జరిగింది. ఇతన్ని బంధువులు వేలూరు ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం తరలించారు. ఇది రోడ్డు ప్రమాదమా.. హత్యా యత్నమా అన్న సంగతి తెలియాల్సి ఉంది. వివరాల్లోకి వెళ్తే శ్రీనివాసులురెడ్డి కడపకు వెళ్తున్న సమయంలో ఈ ఘటన జరిగినట్లు సమాచారం. ఈ విషయంపై పెండ్లిమర్రి పోలీసులను వివరణ కోరగా తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని వారు తెలిపారు.

## శ్రీభద్రకాళి సమేత వీరభద్ర స్వామిని దర్శించుకున్న రాష్ట్ర రవాణా క్రీడా శాఖామంత్రి మండిపల్లి

**రాయచోటి, అక్టోబరు 1, ప్రభాతవార్త:**

రాయచోటి పట్టణంలోని శ్రీ భద్రకాళీ సమేత వీరభద్ర స్వామిని మంగళవారం ఉదయం రాష్ట్ర రవాణా క్రీడా శాఖామంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి దర్శించుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. దేవాల దాయశాఖ ఆధ్వర్యంలో ఆలయ సంప్రదాయం ప్రకారం జిల్లా దేవాదాయ అధికారి, ఆలయ ఈవో, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి వేదమంత్రోచ్చారణలతో మంత్రిని ఆలయంలోకి తీసుకెళ్లారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించి ఆయనకు స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. జిల్లాదేవాదాయ శాఖాధికారి, ఆలయ ఈవో ఆలయ విశిష్టతను వివరించారు.దసరా ఉత్స వాల ఆహ్వాన పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్య నిర్వహణాధికారి డీవీ రమణారెడ్డి, జిల్లా దేవాదాయశాఖాధికారి విశ్వనాథ్, మున్సి పల్ కమిషనర్ వాసు బాబు, అర్చకులు, ఆలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

## మాకు మీ సేవ చేసే భాగ్యం కల్పించు స్వామి!

**తంబళ్లపల్లె, అక్టోబరు 1, ప్రభాతవార్త:**



తంబళ్లపల్లె మండల కేంద్రంలోని శ్రీ భ్రమరాంభిక మల్లికార్జున స్వామిని ఇరువురు మండల స్థాయి తెదేపా నాయకులు దర్శించుకొని స్వామి మా (నా)కు మీ సేవ చేసే భాగ్యం కల్పించాలని విడివిడిగా తమ మనసులోని కోరికను కోరుకున్నారు. తంబళ్లపల్లె మల్లయ్యకొండ కమిటీ ఛైర్మన్ పదవి కోసం పలువురు తెదేపా కూటమి నాయకులు తమ తమ ప్రయత్నాలు చేసుకుంటున్నారు. తెదేపా ఆవిర్భావం నుంచి సామాన్య కార్యకర్తగా తెలుగు యువత అధ్యక్షుడిగా, మండల స్థాయి నాయకుడిగా ఎదిగిన కొటాల శివకుమార్, మండల మాజీ జడ్పీటీసీగా మరియు దశాబ్ద కాలంగా తెదేపా అభివృద్ధి కోసం కృషి చేస్తున్న తంబళ్లపల్లెకు చెందిన రామచంద్రలు ఇరువురు మంగళవారం మల్లయ్య కొండ మహాశివుని దర్శించుకొని తమ మనసులోని కోరికను స్వామి ముందు ఉంచారు. వీరు తెదేపా కీలక నాయకులతో ఓ వైపు రహస్య మంతనాలు చేసుకుంటూ మరో వైపు తమ భారం శివుని మీద మోపారు. అయితే ఆ మల్లయ్య కొండ మహాశివుడు వీరి ఇరువురిలో ఎవరిని కటాక్షిస్తాడో లేక వీరిని కాదని ఈ ఛైర్మన్ పదవిని మరొకరికి వరిస్తుందో వేచి చూడక తప్పదు

## పించన్ల పంపిణీలో ముమ్మరంగా టీడీపీ నాయకులు

**తంబళ్లపల్లె, అక్టోబరు 1, ప్రభాతవార్త:**

తంబళ్లపల్లె మండలంలో మంగళవారం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో అధికార యంత్రాంగంతో పాటు తెదేపా కూటమి నాయకులు ముమ్మరంగా పాల్గొన్నారు. ఉదయం ఎర్రసానిపల్లి పంచాయతీలో టీడీపీ తెలుగు యువత కార్యనిర్వాహక కార్యదర్శి టి.మల్లికార్జున ఆధ్వర్యంలో వృద్దులు, వికలాంగులు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఎంపీడీవో సురేంద్రనాథ్, ఈవోఆర్డీ దిలీప్‌కుమార్ నాయక్, ఏవో ఆనంద్‌కుమార్ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేపట్టి 97% పైగా పూర్తి చేశారు. కార్యక్రమంలో అధికార యంత్రాంగం, సచివాలయ సిబ్బంది, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## చెత్త నుంచి ఎరువుల సంపద తయారు చేసే కేంద్రంను ప్రారంభించిన ఎండీఓ

**ముద్దనూరు, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**



ముద్దనూరు మండలంలోని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం నాడు డీఎన్ పల్లి గ్రామం నందు చెత్త నుంచి ఎరువుల సంపద తయారుచేసే కేంద్రాన్ని మండల పరిషత్ అభివృద్ధి అధికారి ముకుంద రెడ్డి ప్రారంభించారు. ఈ సంధర్బంగా ఆయన మాట్లాడుతూ ముద్దనూరు మండల వ్యాప్తంగా 12గ్రామ పంచాయతీ పరిధిలో చెత్త నుండి ఎరువుల సంపద తయారు చేసే కేంద్రాలను పున: ప్రారంభించామని, త్వరలోనే అన్ని కేంద్రాలకు అవసరమైన సదుపాయాలను సమకూర్చి పూర్తి స్థాయి వినియోగంలోకి తీసుకొని వస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈఓపీఆర్డి వీరబధ్రుడు, ముద్దనూరు గ్రామ పంచాయతీ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమం

**ఖాజీపేట, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**




మండల కేంద్రంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయాధికారిని నాగార్జున ఆధ్వర్యంలో గురువారం కూనవారిపల్లె గ్రామంలో నిర్వహించారు. అనంతరం పొలాలను పరిశీలించి రైతులతో సమావేశం నిర్వహించారు. రైతులకు కావాల్సి న సూచనలు, సలహాలు వివరించారు. సకాలంలో ఎరువులు, పురుగుమందులు వాడాలని సూచించారు. రానున్న వర్షాకాలంలో పంటలు, పశువులకు తీసుకోవాల్సి న జాగ్రత్తల గురించి అధికారులు రైతులతో మాట్లాడారు. కరపత్రాల రూపంలో రైతులకు అవగాహణ కల్పించారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## ద్విచక్ర వాహణాలు జాగ్రత్త

**యర్రగుంట్ల, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**



మండల పరిధిలోని గ్రామాలలోని ద్విచక్ర వాహణదారులకు యర్రగుంట్ల సీఐ నరేష్ బాబు మంగళవారం నాడు తగు సూచనలు విలేకరుల ద్వారా తెలియజేశారు. ఇటీవల కాలంలో సులభ మార్గంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో చెడు వ్యసనాలకు అలవాటు పడిన చాలా మంది యువకులు ద్విచక్ర వాహణాలు దొంగతనాలకు పాల్పడుతున్నారని, తద్వారా వామణదారులు రాత్రి నిద్రిస్తున్న సమయంలో వాహణాలు దొంగలు తీసుకువెళ్తున్నారని అన్నారు. ద్విచక్ర వాహణాలు ఇంటి ఆవరణంలోని కాంపౌండ్‌లో ఉంచి ద్విచక్ర వాహణానికి, గేటుకి కూడా తాళాలు వేయాలని, కాంపౌండ్ లేని వారు ద్విచక్ర వాహణానికి ముందు చక్రానికి ఫ్రంట్ వీల్ లాక్ వేసుకోవడం వల్ల దొంగతనాలు జరగకుండా నివారించ వచ్చే అన్నారు. ఫ్రంట్ వీల్ లాకులు స్పేర్ పార్ట్స్ షాపులో, ఆన్‌లైన్‌లలో అందుబాటులో ఉన్నాయని, ప్రతి ఒక్కరూ ద్విచక్ర వాహణాలు దొంగతనాలు జరగకుండా జాగ్రత్త వహిస్తారని తెలిపారు.

## ఎద్దుల పెద్ద శేశమ్మ అనాధ ఆశ్రమానికి ప్రశంస పత్రం

**యర్రగుంట్ల, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**



అంతర్జాతీయ వృధ్ధుల దినోత్స వం సంధర్బంగా సమాజంలో నిరాదారణకు గురవుతున్న ఒంటరైన వృద్ధులకు అక్కున చేర్చుకొని ఆశ్రయం కల్పించి అన్నీ తామై చేస్తున్న అసమాన్యమైన స్వచ్ఛంద సేవలను జిల్లా స్థాయిలో గుర్తించి వయోవృధ్ధుల సంక్షేమ శాఖ వారి ఆధ్వర్యంలో ఎద్దుల పెద్ద శేశమ్మ అనాధ ఆశ్రమ వ్యవస్థాపకుడు ఎద్దుల నాగేంద్రకి జిల్లా కలెక్టర్ లోతేటి శివ శంకర్ ప్రశంసా పత్రం అందించారు. ఈ సంధర్భంగా నాగేంద్ర మాట్లాడుతూ చాలా ఆనందంగా ఉందని ఇలాంటి సేవలు మరిన్ని చేస్తానని తెలిపారు.

## నిరుపేదలకు అండగా అపర భగీరథుడు నారా చంద్రబాబునాయుడు

**సిద్దవటం, అక్టోబరు 1, ప్రభాతవార్త:**

రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఉన్న నిరుపేదలకు ఆపద్బాంధవుడుగా ఉన్నారని తెదేపా రాజంపేట పార్లమెంటు కార్యదర్శి నాగమునిరెడ్డి మంగళవారం టక్కోలి గ్రామంలో పింఛను పంపిణీ కార్యక్రమంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పింఛను లబ్ధిదారులు కడుపునిండా అన్నం తింటున్నారని గత వైసీపీ ప్రభుత్వంలో పింఛను పెంచుతామని ఏడాదికి రూ.250 పెంచి ప్రభుత్వ వాలంటరీ చేత పబ్లిసిటీలు చేయించుకోవడం తప్ప ఇంకొకటి లేదని వైసీపీ అధికారంలోకి వచ్చాక పేదవాడి కడుపు కొట్టి అన్నా క్యాంటీన్ వ్యవస్థ రద్దు చేయడం చూస్తుంటే గత ప్రభుత్వానికి ఎపేదలపై ఎంత ప్రేమ ఉందో అర్థమవుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో పెను మార్పులతో గ్రామాల అభివృద్ధి చెందే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తుందని రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికలలో కూటమి పార్టీ విజయభేరి మోగించడం తథ్యమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ శివయ్య, సుదర్శన్‌రెడ్డి పాల్గొన్నారు.



## మండలంలో ఎన్టీఆర్ ఎన్టీఆర్ భరోసా విజయవంతం

**కలికిరి, అక్టోబరు 1, ప్రభాతవార్త:**



మండలంలోని 14 పంచాయతీలలో సోమవారం ఎంపీడీఓ గంగయ్య పర్యవేక్షణలో పంచాయతీ కార్యదర్శులు ఆయా పంచాయతీల సర్పంచులు ప్రజా ప్రతినిధులతో సచివాలయ సిబ్బంది సోమవారం ఉదయం 6 గంటల నుంచి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు వృద్ధులకు, వికలాంగులకు పంపిణీ చేశారు. కలికిరి పంచాయతీలో ఎంపీడీవో గంగయ్య, ఇన్‌ఛార్జి యల్లయ్య ఆధ్వర్యంలో పంపిణీ జరిగింది. స్థానిక మర్రికుంటపల్లె సర్పంచ్ ఎ.రెడ్డిరామ్, పత్తేగడ పంచాయతీ సర్పంచ్ రెడ్డమ్మ, గుండ్లూరు సైఫుల్లా, గడీ సర్పంచ్ బేబీ ఆయేసా, పారపట్లలో అరుణ ఆధ్వర్యంలో పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కలికిరి ఈవో గురుమోహన్, కార్యదర్శులు తిమ్మారెడ్డి, మయూరి, గాయత్రి, గోవర్ధన్, రెడ్డిప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

## ఎక్సైజ్ సీఐగా పదవీ బాధ్యతలు చేపట్టిన రాజశేఖర్

**సిద్దవటం, అక్టోబరు 1, ప్రభాతవార్త:**



ఎక్సైజ్ శాఖ పోలీసు స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టరఉగా రాజశేఖర్ మంగళవారం పదవీ బాధ్యతలు చేపట్టారు. గతంలో విధులు నిర్వహించిన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు చిత్తూరు జిల్లా పలమనేరుకు బదిలీ కావడంతో ఆ స్థానంలో కర్నూలు జిల్లా నఉుంచి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా రాజశేఖర్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒంటిమిట్ట సిద్దవటం అట్లూరు ప్రాంతాల్లో ఎవరైనా నాటు సారా, గంజాయి, లిక్కర్, అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. పల్లె ప్రాంతాల్లో ఎవరైనా కూడా నాటు సారా విక్రయిస్తే సమాచారం తెలపాలని తెలిపారు.

## ప్రాణదాతలైన స్వచ్ఛంద రక్తదాతలకు కృతజ్ఞతలు

**పులివెందుల, అక్టోబరు 1, ప్రభాతవార్త :**



స్వచ్ఛందంగా రక్తదానం చేసి ప్రాణదాతలైన రక్తదాతలకు యురేనియం డీజీఎం సుమన్ సర్కార్, ఎస్ఎంఎస్ కంపెనీ సీఈవో ఖలీల్‌సొదాగర్‌లు ధన్యవాదాలు తెలిపారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాతల దినోత్స వం పురస్కరించుకుని మంగళవారం యురేనియం ప్రాథమిక వైద్యశాల, యూసీఐఎల్ యాజమాన్యం కార్పొరేట్ సామాజిక బాధ్యతగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని యురేనియం డీజీఎం సుమన్‌సర్కార్, జనరల్ మేనేజరు సంజయ్ ఛటర్జీ, ఎస్ఎంఎస్ కంపెనీ సీఈవో ఖలీల్ సొదాగర్, సీఎస ఆర్ సూపరింటెండెంట్ నవీ న్‌కుమార్‌రెడ్డి, కోఆర్డినేటరు గంగిరెడ్డి, చీఫ్ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, మెడికల్ అధికారిణి బిం దు, రక్తనిధి మెడికల్ అధికారిణి రేవతి, స్నేహిత అమృతహస్తం సేవా సమితి అధ్యక్షులు రాజులు ప్రారం భించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ స్వచ్ఛందంగా రక్తదానం చేయడం, ప్రాణదాతలుగా మారడం దేవుడు ఇచ్చిన గొప్పవరంగా భావించి ప్రతి ఒక్కరు రక్తదాన కార్యక్రమం ఒక సామాజిక బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. రక్తదానం చేసిన రక్తదాతలకు కృతజ్ఞతలు తెలుపుతూ ప్రశంసాపత్రాలు అందించి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో రక్తనిధి వైద్యులు మారుతిభార్గవ్, నాహిద్, ఎస్‌పిఎఫ్ సిబ్బంది అరుణ్, రాజు, భానుప్రతాప్,పాల్గొన్నారు.

## న్యాయం జరగలేదని మహిళ పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నం

**పీలేరు, అక్టోబరు 01 ప్రభాతవార్తః**



మండలంలోని కాకులారంపల్లె పంచాయతీ ఇందిరమ్మ కాలనీలో నివాసం ఉంటున్న సుగుణమ్మ ఇంటిపై రెండు నెలల కిందట గుర్తు తెలియని వ్యక్తులు క్షుద్రపూజలు నిర్వహించి ఇంటి చుట్టూ అక్షింతలు వేశారు. ఇది గమనించిన కుటుంబ సభ్యులు కొద్ది రోజులు తరువాత ఇంటి చుట్టూ సీసీ కెమెరాలు ఏర్పాటుచేసుకున్నారు. ఈనెల 19వ తేదీ ఇదే కాలనీకి చెందిన తాటిపత్రి నాగరాజు అనే వ్యక్తి క్షుద్రపూజలు నిర్వహించి ఇంటి చుట్టూ అక్షింతలు చల్లడాన్ని సీసీ కెమెరాలో నమోదైయ్యాయి. ఈమేరకు సుగుణమ్మ కుటుంబ సభ్యులు పీలేరు పోలీసు స్టేషన్లఓ ఫిర్యాదుచేశారు. ఈక్రమంలో నాగరాజు కుమార్తె అపరంజి తనను సుగుణమ్మ తమ్ముడు సత్యనారాయణ అత్యాచారయత్నం చేసినట్లు అన్నమయ్య జిల్లా ఎస్పీకి ఫిర్యాదుచేసింది. ఈక్రమంలో కేసులు పరిశీలనలో ఉండగా ఇరువురిని పీలేరు పోలీసు స్టేషన్‌కు విచారణ కోసం పిలిపించారు. సుగుణమ్మ తమకు న్యాయం జరగలేదంటూ పోలీసు స్టేషన్ లోనే తన వెంట తెచ్చుకున్న పురుగుమందు తాగి ఆత్మహత్యాయత్నంకు పాల్పడింది. ఆమెను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించగా పరిస్థితి విషమమని వైద్యులు తెలిపారు. ఇదే విషయమై సీఐ యుగంధర్‌ను వివరణ కోరగా ఇరువురికి ఫిర్యాదు పరిశీలిస్తుండగా సంఘటన చోటు చేసుకున్నట్లు తెలిపారు.

## బోదేషావలి నేత్రుత్వంలో ఎఫ్‌పీఓ ఏర్పాటు

**పీలేరు, అక్టోబరు 01 ప్రభాతవార్తః**



ప్రముఖ ప్రకతి వ్యవసాయ నిపుణులు బోదేషావలి ఆధ్వర్యంలో మంగళవారం రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటైంది. గత ఎనిమిదేళ్లుగా పీలేరు ప్రాంతంలోని రైతులను ప్రకతి వ్యవసాయ పద్దతులపై అవగాహన కల్పిస్తూ చైతన్యవంతుల్ని చేస్తున్న బోదేషావలి రైతులకు వారి పంటలకు గిట్టుబాటు ధరలు ఉత్పత్తులకు విలువ పెంచేందుకు స్వయంగా రైతు ఉత్పత్తిదారుల సంఘం ఏర్పాటుచేసినట్లు బోదేషావలి తెలిపారు. ఇప్పటికే తమ స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్‌శ్యాట్ ఆధ్వర్యంలో ప్రకతి వ్యవసాయంపై అవగాహన సదస్సులు నిర్వహించడమే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాల్లోని సుమారు 200 మంది రైతుల ద్వారా ప్రకతి వ్యవసాయ పద్దతులలో వివిధ వాణిజ్య పంటలు పండించినట్లు ఆయన తెలిపారు. ఇకపై నెక్స్ట్ జెన్ పేరుతో రైతు ఉత్పత్తిదారుల సంఘాన్ని ఏర్పాటుచేసి రైతులకు గిట్టుబాటు ధరలు పంటలకు విలువ పెంచే కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. ఈమేరకు ఆయన జిల్లా ఉద్యానశాఖ వద్ద తన ఎఫ్‌పీఓను రిజిష్టర్ చేశారు. ఈమేరకు ఆయనకు జిల్లా ఉద్యానశాఖ అధికారి రవిచంద్రబాబు, మంగళవారం ఎఫ్‌పీఓ రిజిస్ట్రేషన్ పత్రాలు అందజేశారు.

## ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వాలంటీర్ల వినతి

**బద్వేలు,అక్టోబర్ 01 (ప్రభాతవార్త ):**



తమ న్యాయమైన హక్కుల సాధనలో భాగంగా తమకు ఉద్యోగ భద్రతకల్పించాలని కోరుతూ మున్సిపాలిటీలోని పలువురు వాలంటీర్లు మంగళవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి రితేష్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందించారు .ఈ సందర్భంగా ఏపీ ప్రజా వార్డు వాలంటీర్స్ అసోషియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకట్ మాట్లాడుతూ ఎన్నిక సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు తమకు రూ.10వేలకు వేతనాన్ని పెంచుతూ ఉద్యోగ భద్రత కల్పించాలని అలాగే గత 5 నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలను త్వరిత గతిన మంజూరు చేయాలని కోరారు. కరోనా సమయంలో సైతం తమ ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు తమవంతు సేవలందించామని తమ సేవలను గుర్తించి తమను ఆదుకోవాలని కోరారు. ఇందుకు స్పందించిన రితేష్‌రెడ్డి మాట్లాడుతూ మీ సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారమయ్యేలా చూస్తానని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో వాలంటీర్లు పాల్గొన్నారు.

## ఎస్సార్ఐటీలో గెస్ట్ టాక్

**ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**



సాయి రాజేశ్వరి ఇన్నిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం నాడు శివ శివాని ఇన్నిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ హైదరాబాద్ ప్రొఫెసర్ అండ్ డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి రమణరావు గారిచే ఎంబీఏ విద్యార్థిని విద్యార్థులకు ఎంటర్ ప్రెన్యూర్ షిప్ మైండ్‌సెట్ ఇన్ ది కార్పొరేట్ వరల్డ్ టవర్స్ సస్టెనబిలిటి అనే అంశంపైన గెస్ట్ టాక్ నిర్వహించబడిందని ప్రిన్సి పాల్ డాక్టర్ పాండు రంగన్ రవి తెలిపారు. గెస్ట్ టాక్‌లో బాగంగా ప్రొఫెసర్ రమణారావు విద్యార్థులకు ఎబిలిటిస్ గురించి సవివరంగా తెలియజేశారు. ఎంబీఏ హెచ్ఓడి షబానా బి మాట్లాడుతూ మనం ఉద్యోగాలు అభ్యర్థించే వారిగా కాకుండా ఉద్యోగాలు అందించే పొజిషన్‌కు వెల్లాలని అన్నారు. ఛైర్మెన్ బసిరెడ్డి రాజేశ్వర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్ రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్ రెడ్డిలు ఇటువంటి ప్రోగ్రాంను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంబీఏ అధ్యాపకులు పాల్గొన్నారు.

## వెలుగుస్కూల్‌లో ఘనంగా వృద్దుల దినోత్సవం

**మదనపల్లె, అక్టోబర్ 1 ప్రభాతవార్త :**



పట్టణ సమీపంలోని కోళ్ళబైలు పంచాయితీ అమ్మ చెరువుమిట్ట నందు గల వెలుగు వృద్ధాశ్రమం నందు మంగళవారం అంతర్జాతీయ వృద్దుల దినోత్స వం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన సీనియర్ సిటిజన్స్ వేల్ఫేర్ అధ్యక్షులు మునిగోపాలక్రిష్ణ,ప్రొపెసర్ శ్రీనివాసులు, అడ్వయిర్ మునిరత్నయ్య, ధనలక్ష్మిలు మాట్లాడుతూ వెలుగు వృద్ధాశ్రంలో సేవలు అందిస్తున్న యాజ మాన్యాన్ని అభినందించారు. ఇంతమంది వృద్ధులకు సేవ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్ర మంలో సెక్రటరీ ఉదయ్‌మోహన్‌రెడ్డి, కన్వీనర్ భాగ్యలక్ష్మి, ప్రిన్సి పాల్ లీనాకుమారి, సోషల్‌వర్కర్ గీతా తదితరులు పాల్గొన్నారు. వృద్ధాశ్రంలో వృద్ధులకు చేసిన సేవలు గుర్తించి ప్రొపెసర్ శ్రీనివాసులు రూ.5వేలు, ధనలక్ష్మి రూ.5వేలు అందజేశారు.

## చెకుముకి సైన్స్ పోటీలలో వరుణ్ పాఠశాల విద్యార్థుల హవా

**బ్రహ్మంగారిమఠం ,అక్టోబర్ 01 (ప్రభాతవార్త ):**



మండల కేంద్రంలోని వేమారెడ్డి సత్రంలో చెకుముకి మండల స్థాయి పరీక్షలను ప్రభుత్వ, ప్రైవేటు విద్యార్థులకు నిర్వహించారు. సమాజంలో మూఢనమ్మకాలను నిర్మూలించడమే జనవిజ్ఞాన వేదిక ప్రధాన ఆశయమని వక్తలు విశ్రాంత ఉపాధ్యాయులు చింతారామిరెడ్డి, విశ్రాంత ప్రిన్సి పాల్ సుబ్బారెడ్డిలు పేర్కొన్నారు. శాస్త్రీయ దృక్పధాన్ని పెంపొందించి దేశాన్ని అభివృద్ధి దిశలో నడపడానికి తమవంతు కృషి చేయాలని అందరికీ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల నుంచి విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌లో 8,9,10 తరగతుల విద్యార్థులు గ్రూపుగా సైన్స్ టాలెంట్ టెస్ట్ నిర్వహించడం జరిగిందని, ఇందులో అత్యధిక మార్కులు సాధించిన మొదటి ముగ్గురు విజేతలకు బహుమతులను అందించారు. ఇందులో వరుణ్ హైస్కూల్ నుంచి ఎల్.శరణ్య, ఎ.శిల్ప, ఈ. వరుణ్ సందేశ్‌లు మొదటి విజేతలు కాగా, దీప్తి హైస్కూల్ నుండి ప్రశాంతి, మోక్ష, జి. కీర్తన్‌లు ద్వితీయ విజేతలుగా నిలవగాడాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలన్యూస్కూల్‌కు చెందిన రాజేంద్ర, కారీ _క్, వి.నరసింహులు తృతీయ స్థాయి విజేతలుగా నిలిచారు. వీరికి ఉపాధ్యాయులు,గురుకుల పాఠశాల అధ్యాపకులు బొల్లు రామ్మోహన్, అంకిరెడ్డిపల్లె ఓబుల్‌రెడ్డి, రాయపురెడ్డి లక్ష్మీనరసింహారెడ్డి, ఎస్ఐఎఫ్ రాష్ట్ర కమిటి సభ్యులు గండి సునీల్‌కుమార్ చేతుల మీదుగా విజేతలకు బహుమతులు అందిం చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రత్నం, వసంత కుమారి, ప్రణయ్, ఓబుళపతి, చిట్టిబాబు, జేవివి మండల కార్యకర్తలు ఓబులేసు, రవి తదితరులు పాల్గొన్నారు.

## జనసేన పార్టీ ఎమ్మెల్సీ పిడుగు హరి ప్రసాద్‌ను ఘనంగా సత్కరించిన జననేత అతికారి కృష్ణ

**సిద్దవటం, అక్టోబరు 1, ప్రభాతవార్త:**



సిద్దవటం గ్రామ నివాసి రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నాయకులు మంగళవారం రాష్ట్ర డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల పర్యటన సందర్భంగా ప్రాయశ్చితి దీక్షకు మద్దతుగా విచ్చేసిన జనసేన పార్టీ నాయకులు అతికారి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మా రాష్ట్ర నాయకులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తిరుమల యాత్ర సజావుగా జరగాలని గత వైసీపీ ప్రభుత్వంలో కలియుగ దైవం వెంకటేశ్వర స్వామి ప్రసాదంలో కల్తీ వ్యవహారంలో వైకాపా మోసాన్ని ప్రజలు గమనించాలని భక్తుల మనోభావాలు దెబ్బతినే విధంగా లడ్డూ వ్యవమారం కల్తీ చేశారంటే వీరిని ఏమనాలో ఒకసారి ప్రజలు ఆలోచించాలని డిప్యూటీ సీఎంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వైసీపీ నాయకుల భరతం కలిగయు దైవం వెంకటేశ్వర స్వామి చూసుకుంటాడని తెలిపారు. రాష్ట్రంలో వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఉంటే ఏడుకొండల వెంకటేశ్వర స్వామి ఆలయం పవిత్రత పూర్తిగా దెబ్బతినేదన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దవటం ఒంటిమిట్ట మండల జనసేన పార్టీ కార్యకర్తలుపాల్గొన్నారు.

## శాంతి,సహోదరత్వంతోనే భారతీయుల మధ్యఐక్యత

**మదనపల్లె, అక్టోబర్ 1 ప్రభాతవార్త :**



శాంతి సహోదరత్వంతోనే భారతీయులు మధ్య ఐక్యత సాధించగలమని మదనపల్లె ఎమ్మెల్యే ఎం.షాజహాన్‌బాషా తెలిపారు. దేశంలో శాంతి సమానత్వం కాంక్షిస్తూ, బుద్దిస్‌ట ప్రెటర్నీటని కౌన్సిల్ నేషన్ ధమ్మయాత్ర కమిటీ సంయుక్తంగా కేరళలోని బుద్ధభూమి నుంచి మహారాష్ట్రలోని దీక్షాభూమి వరకు చేపట్టిన అశోక్ అంబేద్కర్ ధమ్మయాత్రకు మదనపల్లెలో అపూర్వ స్వాగతం పలికారు. మంగళవారం ఈ యాత్ర స్థానిక అంబేద్కర్‌సర్కిల్ వద్దకు చేరుకొంది. ఈ సందర్భంగానా బుద్ధ అంబేద్కర్ సమాజ్‌పౌండర్ ట్రస్టీ పిటిఎం శివప్రసాద్ ఆధ్వర్యంలో అంబేద్కర్ సర్కిల్ వద్దకు చేరుకొని బైద్ధ శిక్షవులకు యాత్ర నిర్వాహకులకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే షాజహాన్‌బాషా మాట్లాడుతూ దేశ ప్రజల మధ్య శాంతి సహోదరత్వాన్ని కాంక్షిస్తూ అశోక్ అంబేద్కర్ ధమ్మయాత్ర చేపట్టడాన్ని అభినందించారు. ఇలాంటి కార్యక్రమాలు సామాజిక పరివర్తనకు ఎంతో దోహదం చేస్తాయని సమాజంలో కుల, మత ద్వేషాలను, చెండు వ్యవసనాలను, మూఢ విశ్వాసాలను దూరం చేసి మనుషులను ఉన్నతులుగా మార్చగలవని తెలిపారు. ఈ కార్యక్రమంలో యమలా సుదర్శనం, పోతబోలు రెడ్డప్ప, బురుజు లక్ష్మినారాయణ, గణపతి, నీరుగట్టు రమణ, ముత్యాల మోహన్, పల్లం తాతయ్య, కెవి.రమణ, సొన్నికంటి రెడ్డప్ప, బురుజు రెడ్డిప్రసాద్, చిన్నప్ప తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే వరద సమక్షంలో వైసీపీ నుండి టీడీపిలో చేరిన ఇద్దరు కౌన్సిలర్లు

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**



ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 14, 38వార్డుల్లో వైసీపీ కౌన్సి లర్లు జీలాని బాష, పల్లా రమాదేవిలు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి సమక్షంలో మంగళవారం తెలుగుదేశం పార్టీలో చేరారు. స్థానిక ఎమ్మెల్యే వరద కార్యాలయంలో ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి కౌన్సి లర్లకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి సాదారంగా ఆహ్వానించారు. ఈ సంధబ్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏపీ అబివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం అని నమ్మి వైసీపీ కౌన్సి లర్లు పార్టీలో చేరడం అభినందనీయం అన్నారు. వీరిని పార్టీలోకి మనస్ఫూర్తిగా ఆహ్వానిస్తున్నామన్నారు. పార్టీపై నమ్మకంతో వైసీపీ వీడి వచ్చిన కౌన్సి లర్లు అన్ని విధాలుగా అండగా ఉండి వారి వార్డుల అభివృద్ధకి కృషి చేస్తామన్నారు. రాబోయే రోజుల్లో సీబీఐ కేసులో జగన్‌మోహన్ రెడ్డి జైలుకు వెల్లడం ఖాయం అని దీంతో వైసీపీ పార్టీ ఖాళీ అవుతుందన్నారు. అమరావతి అభివృద్ధి కొరకు కేంద్రం 15వేల కోట్లు ఇచ్చిందని, అమరావతి అభివృద్ధిని ఎవరూ అడ్డుకోలేరన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నంద్యాల కొండారెడ్డి, టిడిపి నాయకులు సీఎం సురేష్‌నాయుడు, ముక్తియార్, ఈవి సుధాకర్ రెడ్డి, చౌటపల్లె లక్ష్మిరెడ్డి, అరవ మునీవర, కౌన్సి లర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాణి తిరుమల దేవి కాలేజీలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం

**ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**

స్థానిక మైదుకూరు రోడ్డులోని రాణి తిరుమల దేవి కాలేజ్ ఆఫ్ సైన్సెస్ ప్రొద్దుటూరు నందు మంగళవారం స్వచ్ఛత హీ సేవ ముగింపు కార్యక్రమాన్ని ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఎన్ఎస్ఎస్ వాలంటీర్స్ విధ్యార్థిని, విధ్యార్థులు కళాశాల ప్రాంగణంలో ఉన్న చెత్తచెదారాన్ని శుభ్రం చేశారు. ఈ సంధబ్భంగా కళాశాల కరస్పాండెంట్ ఎల్.తరుణ్ ఇంద్రశేఖర్, ప్రిన్సి పల్ టి.చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఏర్పాటుచేసిన స్వచ్ఛత హీ సేవా పక్షత్స వాల కార్యక్రమాల్లో భాగంగా కళాశాల ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు విధ్యార్థిని, విధ్యార్థులు 15రోజుల పాటు సుదీర్ఘంగా అనేక సేవా కార్యక్రమాల్లో పాల్గొని గాంధీజి కలలుగన్న స్వచ్ఛ భారత్ ఆశయ సాధనలో భాగస్వాములూ మంచి సేవా దృక్పధాన్ని అలవర్చుకోవాలని తెలిపారు.

## 26వ వార్డులో పింఛన్ల పంపిణీ చేసిన టిడిపి నాయకులు

**ప్రొద్దుటూరు, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**

ప్రొద్దుటూరు పురపాలక సంఘం పరిధిలోని 26వ వార్డులో మంగళవారం ఉదయమే టిడిపి నాయకులు తలారి రమేష్, కాచన శ్రీనివాసుల రెడ్డిలు పింఛన్లను పంపిణీ చేశారు. ఈ సంధర్భంగా లబ్దిదారుల ఇళ్లకే వెల్లి వారు నగదును అందించారు. ఈ సంధబ్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వృధ్ధాప్య పెంఛన్లు ప్రతి నెల 1వ తేదిన ఉదయమే లబ్దిదారులకు చేరవేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. 3వేల నుండి ఒకే సారి నాలుగు వేలకు పింఛన్లు పెంచిన ఘతన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి దక్కుతుందని కొనిఆడారు. రాష్ట్ర అభివృద్ధి తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అని ప్రజలు అఖండ మెజారిటిని అందించి చంద్రబాబును ముఖ్యమంత్రి చేశారన్నారు. ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ఎన్నికలలో చెప్పిన హామీలు అమలు చేస్తున్నారని తెలిపారు.

## చెకుముకితో విధ్యార్థుల్లో సృజనాత్మక పెరుగుతోంది

**ప్రొద్దుటూరు అర్బన్, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**

చెకుముకితో విధ్యార్థుల్లో సృజనాత్మక పెరుగుతోందని వాగ్దేవి ప్రిన్సి పాల్ డాక్టర్ సిద్ధేశ్వర రావు అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీ తొగటవీర క్షత్రియ కళ్యాణ మండపంలో చెకుముకి మండల స్థాయి సైన్స్ సంబరాలను ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని అన్ని స్కూళ్ల నుంచి 300మంది విధ్యార్థులు హాజరయ్యారు. ప్రశ్నా పత్రాలను ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివారెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి బాల సుబ్బారెడ్డిలు ఆవిష్కరించారు. ముఖ్య అతిథి సిద్ధేశ్వర రావు మాట్లాడుతూ ప్రతి విధ్యార్థి చెకుముకి వంటి పరీక్షలు రాయడం వలన వారి ప్రతిభాపాటవాలు వెలుగులోకి వస్తాయని వివరించారు. జిల్లా గౌరవ సలహాదారులు గోపినాధ రెడ్డి ముగింపు సవాఏశానికి అధ్యక్షత వహించారు. తొగట వీర క్షత్రియమ కళ్యాణ మండపం అధ్యక్షుడు బంగారు రఘురామయ్య మాట్లాడుతూ విధ్యార్థులు బాగా చదవి అభివృద్ధిలోకి రావాలని, జీవితంలో సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని అన్నారు. డా.మురుకూటి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ విధ్యార్థులు ఆలోచించాలని, ప్రశ్నించాలని, అభివృద్ధి ఉన్నత స్థానానికి ఎదుగుతారని అన్నారు.

## చెకుముకి సైన్స్ పోటీలు

**దువ్వూరు, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**

దువ్వూరు మండలం గుడిపాడు గ్రామానికి చెందిన శ్రీ శంకరాచార్య హైస్కూల్ విధ్యార్థులు మండల స్థాయి చెకుముకి జన విజ్ఞాన వేదిక సైన్సు పోటీలలో మండల ఫస్ట్ స్థాయిలో నిలిచి జిల్లా స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల కరస్పాండెంట్ మూలె రామ్మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి స్థానంలో జి.లక్ష్మి నరసింహ(గుడిపాడు), డి. రాజేష్‌కుమార్ రెడ్డి(నీలా పురం), రూపేష్(సంజీవరెడ్డి పల్లి) వచ్చినట్లు ఆయన తెలిపారు.

**పాస్‌పోర్టు పోయినది**

కొత్త సాయి నిహార్‌రెడ్డి తండ్రి కొత్త మనోహర్‌రెడ్డి, డి.నెం. 42-114, ఎన్‌జిఓ కాలని, కడప, వైఎస్ఆర్ జిల్లా, ఏ.పి. పిన్ 516001, నా పోస్‌పోర్టు నెం. V3148078, జిరాక్సు సెంటర్ వద్ద పోయినది. దొరికినచో ఈ అడ్రస్‌కుగాని, ఫోన్ నెం. 8074880385 కు తెలపగలరు.

## ఆహారవిజ్ఞానశాస్త్ర కళాశాలలో ముగిసిన స్వచ్ఛత హీ సేవా




**పులివెందుల రూరల్, అక్టోబరు 1, ప్రభాతవార్త ః**
పులివెందులలోని ఆహారవిజ్ఞాన శాస్త్ర, సాంకేతిక కళాశాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ మాట్లాడుతూ స్వచ్ఛతను ఓ జీవన విధానంగా మార్చుకుని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. విద్యార్థులు తమను తాము శుభ్రంగా ఉంచుకుని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా గత రెండు వారాలుగా చేసిన మంచి కార్యక్రమాలను ముందుకు తీసుకువెళ్లగలరని తెలిపారు. పరిశుభ్రత కార్యక్రమం, ర్యాలీలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎం.మాధవ, జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ జయమ్మ, డాక్టర్ నివేదిత, వాలంటీర్లు పాల్గొన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

## తిరుమల లడ్డూ ప్రసాదంపై సుప్రీంకోర్టు ప్రశ్నలు ప్రశంసనీయం

**వేంపల్లె, అక్టోబరు 1, ప్రభాతవార్త ః**
తిరుపతి శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సుప్రీంకోర్టు ప్రశ్నలు ప్రశంసనీయమని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటరు రహంతుల్లా, ఉపాధ్యక్షుడు దాదాపీర్‌లు అన్నారు. వేంపల్లెలో మంగళవారం వారు విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం నడుపుతున్న టీడీపీ, జనేన, బీజేపీలు మనది మంచి ప్రభుత్వమని చెప్పుకుంటున్నాయని, అలాంటి కూటమి పాలకులు అధికారంలో ఉండి కూడా లడ్డు కల్తీ జరిగిందా? లేదా? నిర్ధారించడంలో ఎందుకు వెనుకబడ్డారని వారు ప్రశ్నించారు. ఢిల్లీ నుండి గల్లీ దాకా అధికారంలో ఉన్నప్పటికీ నిజనిర్ధారణ చేయకుండా రాజకీయాలు చేయడం బీజేపీ ఎంపీలు వారి తోక పార్టీలకు తగదన్నారు. ఇటువంటి చర్యలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆప్ మండల సభ్యులు పీర్‌బాషా, అహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

## సుప్రీంకోర్టు అక్షింతలు ఎన్డీఏ కూటమికి చెంపపెట్టు

**వేంపల్లె, అక్టోబరు 1, ప్రభాతవార్త ః**



తిరుమల లడ్డూ వ్యవహారంలో జరుగుతున్న వ్యవహారంపై సుప్రీంకోర్టు బెంచ్ చేసిన వ్యాఖ్యలు రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ కూటమి పార్టీలైన టీడీపీ, జనసేన, బీజేపీలకు చెంపపెట్టు అని కాంగ్రెస్ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ ఎన్.తులసిరెడ్డి అన్నారు. వేంపల్లెలో మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేవుడినైనా రాజకీయాలకు దూరంగా పెట్టండి అని సుప్రీంకోర్టు చేసిన వ్యాఖ్యలు రాజకీయ పార్టీలకు కనువిప్పు కలిగించాలని ఆయన అన్నారు. డిప్యూటి సీఎం పవన్‌కల్యాణ్ ఇప్పటికైనా ప్రాయశ్చిత దీక్ష మానుకుని తిరుపతిలో వారాహి సభ విరమించుకుని పరిపాలన మీద దృష్టి పెడితే మంచిదని ఆయన హితవు పలికారు. విశాఖ స్టీలు ప్లాంటులో కాంట్రాక్టు కార్మికులుగా పనిచేస్తున్న 4290మందిని ఉద్యోగాల నుండి తొలగించడం అన్యాయం అన్నారు. తొలగించిన వారందరినీ తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవాలని తులసిరెడ్డి డిమాండ్ చేశారు.

## ఫ్రీజర్ బాక్సు వితరణ

**కొండాపురం, అక్టోబరు 1, ప్రభాతవార్త ః**



మండలంలోని కొండాపురానికి చెందిన ఫోటోగ్రాఫర్ ప్రభాకర్‌రెడ్డి తన కుటుంబ సభ్యులు ఒంటెద్దు సాంబశివారెడ్డి, చామల వెంకటరెడ్డిల జ్ఞాపకార్థం ఫ్రీజర్‌బాక్సు వితరణగా అందించారు. మంగళవారం శ్రీరాఘవేంద్ర స్వామి కల్యాణ మండపం నిర్వాహకుడైన రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చెంచురెడ్డికి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా అకాల మరణం చెందితే ఫ్రీజర్‌బాక్సు కొరకు గ్రామస్థులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా అందించినట్లు తెలిపారు.

## రైతులు ప్రతి పంటలో విత్తనశుద్ధి పాటించాలి




**కొండాపురం, అక్టోబరు 1, ప్రభాతవార్త ః**
రైతులు ప్రతి పంటలో విత్తనశుద్ధి పాటించాలని ముద్దనూరు సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట సుబ్బయ్య అన్నారు. కొండాపురం మండలంలోని బురుజుపల్లె, యనమలచింతల గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులను ఉద్దేశించి సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ ఈ ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన ప్రతి పంటను ఈపంటలో తప్పకుండా నమోదు చేసుకుని రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని తెలిపారు. అలా చేయించుకుంటేనే ప్రభుత్వం నుండి మంజూరయ్యే బీమా, పంట కొనుగోలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇతరత్రా వర్తిస్తాయన్నారు. మండల వ్యవసాయాధికారి రామాంజులరెడ్డి మాట్లాడుతూ రైతులు కొత్త వంగడాల వైపు మొగ్గు చూపాలని, ప్రతి పంటలో విత్తనశుద్ధి పద్ధతులు పాటించాలని, ప్రతి రైతు భూసార పరీక్షలు చేయించి వాటి ఆధారంగానే ఎరువులు వాడాలన్నారు. గ్రామంలో రబీ ప్రణాళికలో భాగంగా ఎంతమేర శనగలు, ఎరువులు అవసరమవుతాయో రైతన్నల గురించి వివరాలు సేకరించారు. వరిసాగులో తూర్పు, పడమరలు కాలిబాటలు తీసుకోవాలని, దీనివల్ల పైరుకు గాలి, వెలుతురు ప్రసరించి పైరు పిలకలు అంటే గంట బాగా కడుతుందన్నారు. వరిపైరులో చీడపీడల ఉధృతి తగ్గుతుందని రైతులు ఏదైనా పిచికారి మందులు కానీ, ఎరువులు కానీ సులభంగా వేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వీహెచ్ఏ సురేష్‌బాబు, వీఏఏ కన్నబాబు, రైతులు పాల్గొన్నారు.

## పంటకోత ప్రయోగాలు పరిశీలించిన జిల్లా వ్యవసాయ అధికారి

**గాలివీడు, అక్టోబర్ 1(ప్రభాతవార్త):**



మండలంలోని గోపనపల్లె గ్రామంలో జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్ వేరుశనగ పంట కోత ప్రయోగాలను పరిశీలించారు. మంగళవారం మండలంలో పర్యటించిన ఆయన పంటకోత ప్రయోగాలను తనిఖీ చేసి దిగుబడిని లెక్కింపు ప్రక్రియను జరిపారు. పందికుంట గ్రామంలోని రైతు సేవా కేంద్రం పరిధిలో ఈ పంట నమోదు జాబితాలో కొన్ని రికార్డులను పరిశీలించారు. అనంతరం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి మురళీధర్, జేడీఎస్ కార్యాలయ టెక్నికల్ ఏఓలు వెంకటమోహన్, రమేష్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

## ఎంటర్‌ప్రైనర్‌షిప్, స్టాటరప్‌పై అవగాహన సదస్సు

**కురబలకోట, అక్టోబర్ 1 ప్రభాతవార్త :**
అంగళ్ళుకు సమీపంలోని విశ్వం ఇంజనీరింగ్ కళాశాలలో సృజన శిబిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీక్రిష్ణదేవరాయ యూనివర్శిటి ప్రొపెసర్ డాక్టర్ చంద్రమౌళి, ఇంటర్ ఫైనలిషప్ స్టాటరప్ గురించి బిటెక్ ద్వితీయ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలోచనా ఉత్పత్తి దృవీకరణ మార్కెట్ విశ్లేషణ, ఎన్‌జిఒలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులు గురించి ఆయన వివరించారు. విద్యార్థులు, ఉద్యోగాలతో సరిపెట్టుకోకుండా నూతన అవిష్కరణలకు ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ రమణారెడ్డి, అద్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విశ్వంలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

## సూక్ష్మ పోషక లోపాల నివారణ చేపట్టండి - ఏఓ నాగప్రసాద్



రైతులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

**మదనపల్లె, అక్టోబర్ 1 ప్రభాతవార్త :**
రూరల్ మండలంలోని సిటిఎం గ్రామం రేగంటివారిపల్లెలో పొలం పిలుస్తొంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ అధికారులు రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈస ందర్భంగా వ్యవసాయ అధికారి నాగప్రసాద్, కేబికె శాస్త్రవేత శ్రీనివాస్, మదనపల్లె హెచ్ఓ ఈశ్వర్‌రెడ్డి బృందం పొలాలను పరిశీలించి రైతులకు సస్యరక్షణ చర్యలు చూపించడం జరిగింది. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సూక్ష్మ పోషక లోపాల నివారణకుచర్యలు చేపట్టాలన్నారు. ఇందులో భాగంగా రైతులకు జీవన ఎరువులు తప్పక వాడాలని సూచించారు. టమోటా, వరిపైర్లును పరిశీలించి సూక్ష్మక పోషక లోపాలను వెంటనే సవరిస్తే అధిక దిగుబడులు వస్తాయని తెలిపారు. ఈకార్యక్రమంలో వెటర్నరీ నరసింహారెడ్డి,సిరికల్చర్ అధికారి రసూల్, విహెచ్‌డి సుబ్రమ్మణ్యం, నాగేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

## అనిబిసెంట్ సేవలు చిరస్మరనీయం

**మదనపల్లె, అక్టోబర్ 1 ప్రభాతవార్త :**



అనిబిసెంట్ విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

పట్టణంలోని బిసెంట్ థియోసాఫికల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం కళాశాల నిర్మాత డాక్టర్ అనిబిసెంట్ 177వ జయంతి వేడుకలు జరుపుకొన్నారు. బెంగుళూరు రోడ్డులోని అనిబిసెంట్ సర్కిల్‌లో డాక్టర్ అనిబిసెంటమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి ఆమె చేసిన సేవలను స్మరించుకొన్నారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ అనిబిసెంట్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, సిబ్బంది పాల్గొని కళాశాలకు పూర్వవైభవం తేవాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో పాల్గొన్న సభ్యులు అందరూ వారి వారి కళాశాలకు ఉన్న అనుబంధాన్ని నెమరువేసుకొన్నారు. కళాశాల అభివృద్దికి తమవంతు సాయం అందిస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

## టెట్ నిర్వహణ ఏర్పాట్లును పరిశీలించిన అజ్వర్వర్

**కురబలకోట, అక్టోబర్ 1 ప్రభాతవార్త :**



పాఠశాలలో విద్యార్థులను అడిగి తెలుసుకొంటున్న దృశ్యం

టీచర్ ఎలిజిబులిటి టెస్ట్(టెట్) నిర్వహణ ఏర్పాట్లును మంగళవారం అన్నమయ్య, వైఎస్ఆర్ కడపజిల్లా అజ్వర్వర్ సెక్రటరీ మధుసూదన్‌రావు పరిశీలించారు. ఈ నెల 3నుంచి 21వరకు నిర్వహించే టెట్ పరీక్షల నిమిత్తం మండలంలోని మిట్స్, విశ్వ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాట్ల గురించి ఆయన పరిశీలించారు. కళాశాలలో ఉన్న కంప్యూటర్ ల్యాబ్, పర్నీచర్స్, డ్రికింగ్ వాటర్, పోలీస్, పస్ట్ఎయిడ్ ఏర్పాట్లుపై పరిశీలించారు. అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈ పరీక్షలను నిర్వహించాలని స్థానిక అధికారులకు సూచించారు. అనంతరం మండలంలోని ముదివేడు వద్ద ఉన్న కస్తూబిబా గాంధీ గురుకుల పాఠశాలను తనఖీ చేశారు. విద్యాసామర్ధ్యలు, సిలబస్ విరాలను, సిబ్బందిని అడిగి తెలుసుకొన్నారు. పాఠశాలలో సౌకర్యాలను పరిశీలించారు. ఆయన వెంట ఎంఈఓ ద్వారకనాథ్, టెట్‌డిపార్టుమెంటు అధికారులు మనోహర్, రెడ్డిశేఖర్, తదితరులు ఉన్నారు.

## అసిస్టెంట్ ప్రొపెసర్‌కు డాక్టరేట్

**కురబలకోట, అక్టోబర్ 1 ప్రభాతవార్త :**



మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొపెసర్ కె.గిరిధర్‌కు పిహెచ్‌డి పట్టా పొందానని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు. తమిళనాడులోని అన్నామలై యూనివర్శిటి ఈ పట్టాను ఆయనకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఇంప్రూడ్ మెడల్స్ ఫర్ ఎనర్జీ, ఎఫ్ పిసిఎన్‌ట్, రౌటింగ్ ఇన్ వానిటి యూజింగ్ హైబ్రీడ్ మెతహురిస్టక్ అల్లూరి విద్వంసంపై చేసిన పరిశోదనకు గానూ డాక్టరేట్ లభించినట్లు ఆయన తెలిపారు. గిరిధర్‌ను కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.విజయభాస్కర్‌చౌదరి, ఈడి కీర్తినాదేళ్ళలు అభినందించారు.

## మండల ఏపిఎంగా మురళి

**నిమ్మనపల్లె, అక్టోబర్ 1 ప్రభాతవార్త :**



నిమ్మనపల్లె మండల మహిళా సమాఖ్య అసిస్టెంట్ మేనేజర్ (ఏపిఎం)గా తండాల మురళి బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఏపిఎం రజనీకుమారి గుర్రంకొండకు బదిలీ కాగా బి.కొత్తకోటలో పనిచేస్తున్న మురళి బదిలీపై నిమ్మనపల్లెకు వచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వయం సహాయక గ్రూపుసభ్యులకు ప్రభుత్వం అందించిన అన్ని రకాల వెసులబాటలు సకాలంలో అందించేందుకు తమ వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా ఐకెపి మహిళా సభ్యులు, సిబ్బంది ఆయనను అభినందించారు.

## వ్యవసాయ రంగాన్ని కాపాడుదాం
### పర్యావరణాన్ని రక్షిద్దాం

**నిమ్మనపల్లె, అక్టోబర్ 1 ప్రభాతవార్త :**



సమావేశంలో మాట్లాడుతున్న దృశ్యం

వ్యవసాయ రంగాన్ని కాపాడి, పర్యావరణాన్ని రక్షిద్దామని రాష్ట్ర మహిళా వ్యవసాయ వృత్తిదారులు కె.శోభ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపల్లెలో జరిగిన పక్షోత్సవాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమం 15రోజులు పాటు మండలంలో పలు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యూనియన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న కుప్పాల వెంకట సుబ్బయ్య

**సిద్దవటం, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పరిపాలనలో మన రాష్ట్రం పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో దేశ చరిత్రలో ప్రథమంగా ఉందని వృద్ధులు వికలాంగులకు డప్పు వాయిద్యాల కళాకారులకు దళారీ వ్యవస్థకు మార్పుగా ప్రభుత్వ ఉద్యోగులచే నేరుగా వారి ఇంటికి వెళ్లి ఇవ్వడం ఒక సంచలన మార్పుగా ఉందని రాష్ట్ర పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆర్గనైజర్ సెక్రటరీ కుప్పాల వెంకట సుబ్బయ్య తెలిపారు. మండల పరిధిలోని బొగ్గిడివారిపల్లి గ్రామ పంచాయతీ గంగానగర్ కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బొగ్గివారిపల్లె గ్రామ పంచాయతీ గంగానగర్ కాలనీలో నీటి సమస్య పరిష్కారం కోసం నూతనంగా నీళ్ల ట్యాంకు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వానికి అన్ని విధాలా అభివృద్ధి చేసే విధంగా ఇతర రాష్ట్రాలతో పోటీ పడి ముందుకు వెళ్తున్న రాష్ట్ర సీఎం చంద్రబాబునాయుడు పాలనకు ఎవరూ సాటిరారన్నారు. వరద బీభత్సంలో అతలాకుతలమైన ప్రాంతాలలో కేవలం 10 రోజుల్లో ఆ ప్రాంతంలో సుడిగాలి పర్యటన చేసి బాధితులకు అండగా నిలబడి నేనున్నానంటూ భరోసా ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రటరీ సుజాత, సర్పంచ్ ప్రతినిధి పులి ఓబయ్య, అసెంబ్లీ అధికార ప్రతినిధి రామ్మోహన్ నాయుడు, తెదేపా నేత చెంచయ్య నాయుడు, ఆకుల వెంకటరమణ, బాలకృష్ణ, గాలి పెద్ద ఓబయ్య, పుత్తా, రాజు గ్రామ మహిళలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**లక్కిరెడ్డిపల్లె, అక్టోబర్ 01, ప్రభాతవార్త :**



ఉలవలు పంపిణీ కార్యక్రమంలో కూటమి నాయకులు

ప్రభుత్వం రాయితీతో అందిస్తున్న ఉలవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని టిడిపి నాయకులు తెలిపారు. మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రం-2 వద్ద మంగళవారం రైతులకు ఉలవలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రం-2కు 45 క్వింటాళ్లు వచ్చాయని, వాటిని ప్రభుత్వం 80 శాతం రాయితీతో రైతులకు అందిస్తుందని, 10 కేజీల ప్యాకెట్ ధర రూ. 175 రూపాయలు మాత్రమేనని, కావున రైతులు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల యువ నాయకులు, మాజీ ఎంపిటిసి మదన్‌మోన్, బిజెపి మండల అధ్యక్షుడు కొండూరు వెంకట్రామరాజు, రాజంపేట డాక్టర్ సెల్ ప్రధాన కార్యదర్శి షఫీ నాయక్, దేవానందరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, మసూద్, ముక్తార్, మల్లి, వెంకటరెడ్డి, చెల్లు శ్రీను పాల్గొన్నారు.

## ప్రముఖ దేశ నాయకుల ఫోటోలు పాఠశాలకు విరాళం

**మైదుకూరు, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**



మైదుకూరు మండలం ఎన్ ఎర్రబల్లె పంచాయతీలోని సుంకులుగారి పల్లి పాఠశాలకు ఉప్పుగుంటపల్లె కృష్ణ కిషోర్ యాదవ్ ప్రముఖ దేశ నాయకుల ఫోటోలు పాఠశాల ఉపాధ్యాయులు, పిల్లలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాట్లాడుతూ పిల్లలకు పాఠశాల నుండి ప్రముఖ దేశ నాయకుల గురించి తెలియజేయడానికి నేను ఈ నిర్ణయం తీసుకున్నానని ఉపాధ్యాయులు కూడా ప్రముఖుల గురించి పిల్లలకు నేర్పించాలని విద్యార్థి దశ నుండే దేశభక్తి గురించి ప్రముఖుల గురించి తెలుసుకున్నప్పుడే సమాజానికి ఉపయోగపడే విధంగా ఉంటారని తెలియజేశారు. అనంతరం మధ్యాహ్నం పిల్లలకు అతిథి భోజన కార్యక్రమాలు కూడా చేశారని తెలియజేశారు. ప్రధానోపాధ్యాయురాలు నాగలక్ష్మి దేవి మాట్లాడుతూ విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా దాతలు ముందుకు రావడం స్ఫూర్తిదాయకం అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వరలక్ష్మి, వహీదా, స్థానికులు తదితరులు పాల్గొన్నారు. సుంకులుగారి పల్లి పాఠశాల విద్యార్థులు తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## పొలం పిలుస్తుంది కార్యక్రమంలో తెగుళ్ల నివారణ




**మైదుకూరు, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**
మైదుకూరు మండలంలో పొలం పిలుస్తుంది కార్యక్రమం మిట్టమానుపల్లి పప్పునపల్లి, గ్రామాలలో వ్యవసాయ శాఖ మరియు అనుబంధ శాఖలైన ఉద్యాన శాఖ మైక్రో ఇరిగేషన్ హార్టికల్చర్ యూనివర్సిటీ నుండి శాస్త్రవేత్తలు పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్షేత్రస్థాయిలో వివిధ పంటల్లో ఉన్నటువంటి పురుగు మరియు తెగుళ్లకు నివారణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి.ప్రసన్న ఉద్యాన శాఖ అధికారి రామకృష్ణ, డాక్టర్ ఫిరోజ్ హుస్సేన్, యూనివర్సిటీ నుండి కె వి కె ఒనిపెంట గుర్రప్ప, సెరి కల్చర్ సిద్దారెడ్డి, మైక్రో ఇరిగేషన్ షర్మిల వి ఏ ఏ మరియు రైతులు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఫించన్ పంపిణీలో ఎంపిడిఓ

**మైదుకూరు, అక్టోబర్ 1, ప్రభాతవార్త:**



ఒనిపెంట, మిట్టమానపల్లె గ్రామ సచివాలయ పరిధిలో మంగళవారం జరిగిన పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో గౌరవనీయులు మండల పరిషత్ అభివృద్ది అధికారి పి.లక్ష్మీదేవి పాల్గొన్నారు. పలు గ్రామాలలో స్వయంగా పాల్గొని పింఛన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మైదుకూరు 4645 మంది ఉండగా 4530 కి పింఛన్ పంపిణీ జరిగిందని కడప జిల్లాలో రెండవ స్థానంలో ఉన్నామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## చెకుముకి మండలస్థాయి విజేత ఇనగలూరు హైస్కూల్

**తొండూరు, అక్టోబరు 1, ప్రభాతవార్త ః**



తొండూరు మండలంలో నిర్వహించిన చెకుముకి పోటీలలో ఇనగలూరు హైస్కూల్ విద్యార్థులు ప్రథమస్థానంలో నిలిచినట్లు ప్రధానోపాధ్యాయుడు కె.వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఈనెల 27న కడపలో జరిగే జిల్లాస్థాయి పోటీలలో ఈ విద్యార్థులు పాల్గొంటారన్నారు. ద్వితీయ, తృతీయ స్థానాలను తొండూరు, అగడూరు ఉన్నత పాఠశాలల విద్యార్థులు సాధించినట్లు ఆయన తెలిపారు.

## విద్యుత్ అంతరాయానికి సహకరించండి

**నిమ్మనపల్లె, అక్టోబర్ 1 ప్రభాతవార్త :**
మండల కేంద్రమైన నిమ్మనపల్లెలోని బుధవారం ఉదయం 10గంటల నుంచి 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఏఈ నాగరాజ మంగళవారం తెలిపారు. విద్యుత్ మరమ్మత్తుల దృష్ట్యా నిమ్మనపల్లె టౌన్‌లో మాత్రం విద్యుత్ ఉండదని తెలిపారు. ఈ అంతరాయానికి ప్రజలు సహకరించాలని కోరారు.

## స్వచ్ఛతాహి సేవా స్ఫూర్తితో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**- ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ అపర్ణ**

**కలికిరి, అక్టోబరు 1, ప్రభాతవార్త:**
ప్రధాన మంత్రి నరేంద్ర మోది పిలుపునిచ్చిన స్వచ్ఛతాహి సేవా స్ఫూర్తితో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు తమ పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని కలికిరి జేఎన్‌టీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డా.అపర్ణ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని మర్రికుంటపల్లె సచివాలయం పరిధిలో అన్నమయ్య జిల్లా నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో స్వచ్ఛతాహి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అపర్ణ నెహ్రూ యువకేంద్రం సిబ్బంది మర్రికుంటపల్లె చివాలయ పరిధిలోని పరిసరాలు శుభ్రం చేశారు. బుధవారం జరగనున్న మహాత్మ గాంధీ జయంతి సందర్భంగా ముందుగా సచివాలయంలో గాంధీ చిత్రటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డా.అపర్ణ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కాపాడేందుకు నెహ్రూ యువకేంద్రం వారు ఈ కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మర్రికుంటపల్లె పంచాయతీలో స్వచ్ఛతాహి సేవా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించారు. బ్లాక్ కోఆర్డినేటర్ వెంకటేశ్వర్, నెహ్రూ యువజన కేంద్రం కోఆర్డినేటర్లు బాలాజీ, పంచాయతీ కార్యదర్శి గాయత్రి, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# పల్లెలను నిద్రలేపుతున్న ఫింఛన్లు

**రాజంపేట,అక్టోబర్ 01,ప్రభాతవార్త :**



గత కాలాన్ని గుర్తు చేసుకుంటే పక్షుల కిసకిసలు కోడి కూతలు పల్లెలను నిద్ర లేపేవి అయితే ప్రస్తుతం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎన్టీఆర్ భరోసా ఫింఛన్లు ప్రతి నెలా 1వ తేదీ రాగానే పల్లెవాసులను తలుపులు తట్టి లేపుతున్నాయి. వృద్దులకు, వితంతువులకు, వికలాంగులకు, అవిటితనం కలిగిన అర్హులైన అందరికీ ఫించన్లు వారిలో మనోధైర్యాన్ని నింపుతూ భరోసా ఇస్తున్నాయనే చెప్పొచ్చు. రాష్ట్ర ముఖ్యమంత్రి మొదలుకొని మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలైన ప్రజా ప్రతినిధులు, కలెక్టర్ల నుంచి కార్యదర్శుల వరకు గ్రామ గ్రామాన ఉండే తెలుగు తమ్ముళ్లు, కార్యకర్తలు, కోడి కూత వినక ముందే పల్లెల్లోనికి ప్రవేశించి తలుపులు తట్టి ప్రతి నెలా 1వ తేదీన ఠంచన్‌గా పేదలకు ఫింఛన్లు అందిచడం చూస్తుంటే గతంలో పల్లెల ప్రజలు పోలాల పనులకు వెళ్లేందుకు కోడి కూతలు, పక్షుల కిసకిసలు గుర్తు కొస్తున్నట్లు అనుకుంటున్నారు, గతంలో ఏ వాలంటీరో, ఒక రోజు మొదలు కొని నాలుగైదు రోజుల పాటు గడువును నిర్ధేశించుకొని అందుబాటులో ఉన్న వారికి అందజేసి మిగిలిన పింఛన్ సొమ్మును తిరిగి ప్రభుత్వానికి వాపసు చెల్లించేవారు. అయితే ప్రస్తుతం అధికార పార్టీ అయిన తెలుగు దేశం ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా ఫింఛన్‌ను 1వ తేదీనే ఉదయం తెల్లవారు జామునుండి సాయంత్రం లోపు 99 శాతం పంపిణీ చేస్తున్నారు. ఏదో సామెత చెప్పిన విధంగా ఏదైనా జరిగితే పల్లెల్లో కాకులు మల్లినట్లు అన్న చందంగా తెలుగుదేశం కార్యకర్తలు మొదలుకొని ప్రభుత్వ శాఖలైన క్రింది స్థాయి నుండి పై స్థాయి అధికారుల వరకు అన్ని స్థాయిల ప్రజా ప్రతినిధులు నెల మొదటి తారీకు రాగానే ఫింఛన్ దారులు ఎక్కదున్నా కాకులు చుట్టుముట్టినట్లు చుట్టు ముట్టి ఫింఛన్లును పంపిణీ చేస్తున్నారు. ఒక గ్రామంలో 10 మందిది ఫింఛన్ దారులుంటే రెండింతల మంది ఫింఛన్ ఇచ్చే ప్రభుత్వ ఉద్యోగిని తీసుకొని గ్రామాలకెళ్లి పంపిణీ చేయడం జరుగుతుంది. దీంతో మంచంలో ఉన్న అవ్వ,తాతలు నడవలేని వికలాంగులు వినబడి, కనబడని అంధులు, భర్తలను కోల్పోయి, భర్తలను కోల్పోయి వితంతువులైన మహిళల నిద్ర మంచం లేవక ముందే తట్టి లేపి ఫింఛన్ల పంపిణీ చేస్తున్నారు. దీంతో ప్రతి నెలా మొదటి తారీకున ఫింఛన్ పంపిణీ దారులు పల్లెలను తట్టి నిద్ర లేపి జనాలతో పండుగ వాతావరణాన్ని సంతరించుకునేలా చేపట్టడమనేది చెప్పుకోదగ్గ విషయం.

## పెన్షన్ దారుల ముఖాల్లో ఆనందోత్సవాలు

**నిమ్మనపల్లె, అక్టోబర్ 1 ప్రభాతవార్త :**



ఫింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

నిమ్మనపల్లె మండలంలోని రెడ్డివారి పల్లె, ఒడ్డిపల్లె గ్రామాల్లో ఎన్‌టిఆర్ బరోసా పెన్షన్ల పంపిణీకి ముఖ్య అతిథిగా మదనపల్లె ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పాల్గొని ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ వృద్దులకు, వికలాంగులకు స్వయంగా పెన్షన్లు పంపిణీ చేశారు. ఈ సందర్బంగా రాష్ట్ర సిఎం నారా చంద్రబాబునాయుడు పెంచిన పెన్షన్ రూ.4 వేలు, 6వేలు, 10వేలు, 15వేలు పొందుతన్న వారి మొకాల్లో ఆనందోత్సవాలు కనపడ్డాయన్నారు. ఈ సందర్బంగా మంచానికి పరిమితమైన ఓ వికలాంగుడు రెడ్డివారిపల్లెలో రూ.15వేలు అందుకొంటూ వికలాంగుడు మాట్లాడుతూ ప్రతినెల 1వ తేది నా ప్రాణం ఉన్నంతవరకు పండుగలా బావిస్తానన్నారు. ఈ సందర్బంగా భార్య, బిడ్డలు చేయలేని సహాయన్ని సిఎం చేస్తుండడంతో చంద్రబాబును పొగిడాడు. అనంతరం మాజీ జడ్పిటిసి సభ్యులు రాజా స్వగృహంలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తేనేటి విందులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ రమేష్‌బాబు, తహశీల్దార్ రామాంజనేయులు, ఏపిఎం మురళి, పార్లమెంటరీ పార్టీ మీడియా ప్రతినిధి రాజన్న, టిడిపి పార్లమెంటు అధికార ప్రతినిధి ఆర్‌జె.వెంకటేష్, మాజీ కోప్షన్ సభ్యులు సుధాకర్‌రావు, మాజీ ఎంపిపి అంగజాల మల్లికార్జున, రామక్రిష్ణ, ఆసుపత్రి మాజీ ఛైర్మెన్ శ్రీపతి, బిసి నాయకులు లక్ష్మన్న, చిన్నా, రెడ్డప్ప, రాజా, రమణారెడ్డి, మునెప్ప, గోపాలక్రిష్ణ, సర్పంచ్‌లు మల్లప్ప, రెడ్డప్ప, మాజీ సర్పంచ్‌లు రమణ, రఫి, లక్ష్మన్న, నాయకులు ఓబుల్‌రెడ్డి, షఫి, ఖాసీం, సోము తదితరులు పాల్గొన్నారు.

## స్నేహ సంకల్ప చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్





**పీలేరు,అక్టోబరు 01 ప్రభాతవార్తః**

నియోజకవర్గంలోని కలికిరి యల్లమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో బ్లడ్ డొనేషన్ క్యాంప్ మంగళవారం నిర్వహించారు. ఇంటర్నేషనల్ బ్లడ్ డొనేషన్‌డే సందర్బంగా కలికిరి స్నేహ సంకల్ప చారిటబుల్ ట్రస్టు సభ్యులు దీప బ్లడ్ బ్యాంక్ వారి ప్రోత్సాహంతో నిర్వహించారు. ఈకార్యక్రమంలో శ్రీనివాస కళాశాల విద్యార్థులు స్వచ్చందంగా పాల్గొన్నారు. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ లోకవర్ధన్ శ్రీయల్లమ్మ దేవస్థానం ధర్మకర్త రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి పాల్గొని విద్యార్థులకు రక్తదానం చేయడం వల్ల వచ్చే ఉపయోగాలు వాటి ద్వారా మన శరీరం ఏవిధంగా యాక్టివేషన్ అవుతుందని తెలియజేశారు. విద్యార్థులకు ఫ్రూట్స్, గ్లూకోస్‌ని అందజేశారు. ఈకార్యక్రమంలో డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ లోకవర్ధన్, రెడ్డివారి అశోక్‌కుమార్‌రెడ్డి, రెడ్డివారి మధుసూధన్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సేవా సంకల్ప చారిటబుల్ ట్రస్టు ప్రెసిడెంట్ షేక్ రియాజ్, జిల్లా సెక్రటరీ ఇనాయతుల్లా, దీప, బ్లడ్ బ్యాంక్ సభ్యులు రవీంద్రనాయక్, చంద్రహాస్, రెడ్డెప్ప, వెంకటశివ, వెంకటేష్, సేవా సంకల్ప సుభ్యులు రెడ్డిరాణి, ముబారక్, అజయ్‌లక్ష్మీ పాల్గొన్నారు.

## బిసిఆర్ ఫింఛన్ల చేయుత

**పెనగలూరు,అక్టోబర్01,ప్రభాతవార్త :**



మండల వ్యాప్తంగా గిరిజన కాలనీవాసులకు వితంతువులకు ప్రభుత్వం నుండి ఫింఛన్ అందని వారికి మాజీ ఎమ్మెల్సీ బత్యాల చంగల్ రాయుడు తన పుట్టిన రోజు సందర్బంగా మాట ఇచ్చిన కారణంగా ప్రతి నెలా ఫింఛన్ రూ.1000లను జూన్ మాసం నుండి ఇవ్వడం జరుగుతుంది. ఈ కార్యక్రమంలో అక్టోబర్ మాసంలో గిరిజన ఆ కాలనీ వాసులకు మంగళవారం ఇవ్వడం జరిగిందని టిడిపి నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంమలో కోలా మురళి, షేక్ హబీబ్, జిలకర సుబ్బయ్యలు పాల్గొన్నారు.

## విజయవంతమైన చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్

**బద్వేలు అర్బన్, అక్టోబర్ 1 (ప్రభాతవార్త):**

పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలనందు మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్‌టెస్ట్ జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇందులో ప్రభుత్వ పాఠశాలల నుంచి బద్వేలుమండలానికి సంబంధించి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మొదటి స్థానంలో నిలువగా, బాలికోన్నత పాఠశాల ద్వితియ స్థానంలో చిన్నకేశంపల్లె పాఠశాల తృతీయ స్థానంలో నిలిచినట్లు జేవివి.జిల్లా గౌరవా సలహాదారులు చింతంరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. అలాగే గోపవరం మండలం సంబందించి జడ్పీ హైస్కూల్ రాచాయపేట మొదటి స్థానం, పూసలవాడ, బి.వి.ఆర్.నగర్ పాటశాలలో ద్వితియ, తృతీయ స్థానాలలో నిలిచాయన్నారు. ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి మహేశ్వర్ రెడ్డి పాఠశాల మొదటిస్థానం, బద్వేలు పబ్లిక్ పాఠశాల రెండవస్థానం, అలాగే బద్వేలు మండలానికి సంబంధించి నేతాజీ పాఠశాల మొదటి స్థానంలో నిలిచిందన్నారు. ఈకార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటసుబ్బారెడ్డి, జేవివి.గౌరవాధ్యక్షులు కొండపల్లి చిన్న సుబ్బారావు, ఎస్టీయు బద్వేలు మండల అధ్యక్షులు రమేష్‌రాజా, సైన్సు ఉపాధ్యాయులు నరసింహారెడ్డి, ఉపాధ్యాయులు ఆంథోని, సుబ్బారావు, అయ్యవార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## కబ్జాదారులను వదిలేసి పేదలపై పగ సాధించడం తగదు

: నియోజకవర్గంలో టీడీపీ, వైసీపీ సిండికేట్ రాజకీయాలు తగవు

: సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ



**బద్వేలు,అక్టోబర్ 01 (ప్రభాతవార్త ):**

వైసీపీ హయాంలో జిల్లా వ్యాప్తంగా జరిగిన భూ కబ్జాలు, దాడులు దౌర్జన్యాలను నిరసిస్తూ బద్వేలు మంగళవారం సీపీఐ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వ భూముల అన్యా క్రాంతాన్ని నిరసి స్తూ సీపీఐ జిల్లా సమితి ఆద్వర్యంలో నాలుగు ఓడ్ల కూడలిలో నిర్వహించిన బహిరంగ సభకు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రామ క్రిష్ణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈసందర్బంగా ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి సొంత జిల్లాలో ఇంత పెద్ద ఎత్తున భూ కబ్జాలు, దాడులు జరగడం దారుణమని, వీటిని తట్టుకోలేని పలువురు బాదితులు తమ భూములను వదిలి పారిపోయారని రాత్రికి రాత్రే భూయజమా నులను సైతం రికార్డులను మాయం చేసిన ఘనత వైసీపీ వారికే దక్కుతుందన్నారు. అనంతరం సీపీఐ రాష్ట్ర కార్యదర్వి వర్గ సభ్యు లు ఓబులేసు, ఈశ్వరయ్యలు మాట్లాడుతూ పేదవాడు జానెడు జాగా కోసం పోరాటం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని, నియోజకవర్గంలో 40 మంది భూ అక్రమార్కుల గురించి గతంలో కలెక్టర్ దృష్టికి తీసుకుపోయినా ఫలితం లేదని, అంతేగాక నియోజకవర్గంలో కాశినాయన మండ లం అక్కెంగుండ్ల నుంచి అట్లూరు వరకు సుమారు 30 వేల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా చేస్తుంటే రెవెన్యూ అధికారులు, పాలకులు ఏమి చేస్తున్నారని వారు ప్రశ్నించారు. పోరుమామిళ్ల మండలం రంగ సముద్రంలో ఒక వీఆర్వో కోటి రూపాయల విలువ చేసే ఇల్లు కట్టుకుని నేడు స్మశాన స్థలానికి పలువురు అక్రమార్కులు పట్టాలు పుట్టించినా వారికి పట్టడం లేదన్నారు. బద్వేలు పట్టణంలో నిరుపేదలు పీపీకుంట సీ.కొత్తపల్లి గ్రామపొలం భాకరాపేట వద్ద పేదల గుడిసెలు వేసుకుంటే వాటిని తొలగిస్తామని అధికారులు ఆదేశాలు జారీ చేయడం సరికాదని , కొత్తపల్లె గ్రామ పొలంలో అధికార, ప్రతిపక్ష నాయకులు కంచెలు వేసుకని జామాయిల్ చెట్లు వేసుకున్న విషయం మీకు తెలియదా అని ప్రశ్నించారు. పేదలకు న్యాయం జరిగితే సహించేది లేదని, ప్రతక్ష తిరుగుబాటు తప్పదన్నారు. అంతకుముందు సీపీఐ ఆధ్వ ర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీరశేఖర్, జిల్లా కార్యదర్శి గాలిచంద్ర, జిల్లాకార్యవర్గ సభ్యులు రామయ్య, వెంకట శివ, సుబ్రమణ్యం, సుబ్బరాయుడు, ఎం.వి.సుబ్బారెడ్డి, ఏఐఎస్ఎఫ్ జిలాల అధ్యక్షులు శివశంకర్, డిహెచ్‌పీఎస్ జిలా్ల కార్యదర్శి మునెయ్య, మహిళా సమాఖ్య నాయకురాలు భాగ్యమ్మ, జమ్మలమడుగు ప్రసాద్, షావలి, బాష్కర్, శివరాం, బద్వే లు ఏరియా సహాయ కార్యదర్శి మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

## వద్దులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి

**వాల్మీకిపురం, అక్టోబర్ 01 ప్రభాతవార్తః**

నియోజకవర్గంలోని వాల్మీకిపురంలో అంతర్జాతీయ వద్దుల దినోత్సవం సందర్భంగా హెల్త్ ఎడ్యుకేటర్ మహమ్మద్ రఫీ, టీబీ పర్యవేక్షకులు నాగిరెడ్డి మాట్లాడుతూ వద్దులు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు. మండలంలోని చింతపర్తి పీహెచ్‌సీ పరిధిలోని మంచూరు గ్రామంలో వద్దులకు ప్రత్యేక ఆరోగ్య అవగామన సమావేశం, ఆరోగ్య పరీక్షలు డాక్టర్ శ్రీవిద్య పర్యవేక్షణ నిర్వహించారు. ఈసందర్భంగా మహమ్మద్‌రఫీ మాట్లాడుతూ వయస్సు పెరిగే కొద్దీ ఆరోగ్య సమస్యలు వస్తుంటాయని ఎప్పటికప్పుడు తొలిదశలో వాటిని గుర్తించి చికిత్సలు తీసుకోవాలన్నారు. కంటిచూపు తగ్గిపోవడం చెవులు వినపడకపోవడం, అలెర్జీలు, దంతాలు రాలిపోవడం, మతిమరుపు, మోకాళ్ల నొప్పులు, చిప్పలు అరిగిపోవడం పోషకాహార లేమి, రక్తహీనత, మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ గుండెజబ్బులు వంటివి సాధారణంగా వస్తూ ఉంటాయి. శుక్లము కంటి ఆపరేషన్ సరైన సమయంలో గుర్తించి చికిత్స తీసుకోవాలి సరైన నిద్ర, ఆహారం, వాకింగ్, యోగా ఆసనాలు క్రమం తప్పకుండా పాటిస్తే జీవితకాలం పొడిగించుకుని సంతోషగా జీవించవచ్చున్నారు. వద్దుల పట్ల నిరాదారణ ఎక్కువగా ఉందని అందుకే ఎక్కువగా వద్దాశ్రమాల సంఖ్య పెరుగుచున్నవని ఆందోళన వ్యక్తం చేశారు. అనేక స్వచ్ఛంద సంస్థలు విరివిగా ఉచిత కంటి క్యాంపులు, ఆరోగ్య శిబిరాలు, గుండె పరీక్షల క్యాంపులు , షుగర్, బీపీ, క్యాన్సర్ శిబిరాలు నిర్వహించి చేయూత నిస్తున్నాయి. వద్దులకు సామాజిక భద్రత పెన్షన్ కూడా ప్రభుత్వం ప్రతి నెల ఇంటి వద్దకే అందిస్తున్నది. ఈ

## రేపటి నుంచి రాజంపేటలో దసరా శరన్నవరాత్రి వేడుకలు

అంగరంగ వైభవంగా ముస్తాబైన అమ్మవారి శాల





**రాజంపేట అర్బన్, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**

ఉమ్మడి కడప జిల్లాలోనే ప్రొద్దుటూరు తర్వాత అత్యంత వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు జరిగే రాజంపేట అమ్మవారి శాల దసరా ఉత్సవాలకు ముస్తాబైంది. రేపు దసరా ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. గురువారం తెల్లవారుజామునే బ్రహ్మ ముహూర్తంలో ఉత్సవాలకు గణపతి పూజతో శ్రీకారం చుడతారు. పది రోజుల క్రితమే దసరా ఉత్సవాల పనులు జోరుగా జరుగుతున్నాయి. అమ్మవారి శాల గర్భాలయంలోనూ వెలుపల, ప్రధాన రహదారి, అమ్మవారి శాలను రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. మైసూరు ప్యాలెస్ ఉట్టిపడేలా అమ్మవారి శాల వీధి సర్కిల్‌లో చూడ ముచ్చటగా సెట్టింగ్ ఏర్పాటు చేశారు. ప్రధాన రహదారుల వెంట దేవతామూర్తులను విద్యుత్ దీపాలతో అలంకరించారు. 9రోజుల పాటు శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లను రాజంపేట ఆర్యవైశ్య సంఘం పక్కా ప్రణాళికతో సిద్ధం చేస్తోంది.

### మండల స్థాయి చెకుముకి

# సంబరాలు విజయవంతం

ముఖ్య అతిధులచే బహుమతుల ప్రధానం




**యర్రగుంట్ల, అక్టోబర్ 01, ప్రభాతవార్త:**

స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల యర్రగుంట్ల నందు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో మండల స్థాయి చెకుముకి పోటీలు నిర్వహించడం జరిగిందని జెవివి మండల అధ్యక్ష కార్యదర్శులు దినేష్ మరియు రాజులు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా పాల్గొన్న ఎంఈఓ శివప్రసాద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక విధ్యార్ధుల్లో మూఢ నమ్మకాలను నిర్మూళన చేసి శాస్త్రీయ అవగాహణ కల్పించే ఒక మంచి సంస్థ అని అన్నారు. విధ్యార్థులు సైన్స్‌ను విశ్వసించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు రామాంజనేయులు రెడ్డి మాట్లాడుతూ చెకుముకి వంటి పోటీ పరీక్షల వలన విధ్యార్ధి దశ నుండే పోటీతత్వం పెరుగుతుందని అన్నారు. జెవివి జిల్లా కార్యదర్శి సుజన్‌కుమార్ మాట్లాడుతూ చెకుముకి పరీక్ష గత 35సంవత్సరాలుగా జెవివి విధ్యార్థులకు నిర్వహిస్తుందని అన్నారు. దీని వలన విద్యార్థుల్లో విజ్ఞానం పెరుగుతుందని తెలియజేశారు. విజేతలకు ముఖ్య అతిధులుగ పాల్గొన్న ఎంఈఓ శివప్రసాద్ మరియు హెడ్ మాష్టర్ రామాంజనేయులు రెడ్డి, జెవివి నాయకుల చేతులమీదుగా పాఠశాలకు మోమెంటో, విధ్యార్ధులకు మెడల్స్ మరియు సర్టిఫికెట్లతో పాటు డా.అంబవరం ప్రభాకర్ రెడ్డి రచించిన విధ్యార్ధి విజయ రహస్యం అనే పుస్తకం బహుకరించడం జరిగింది. ప్రధమ స్థానంలో నిలిచిన రెండు జట్లు ఈ నెల 27న కడపలో జరిగే జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాల్లో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి బాలబాయన్న, కార్యదర్శి సుజన్‌కుమార్ దరియా, జెవివి మండల నాయకులు జాకట దినేష్, తప్పెట జయరాజు, పీటర్, ఉపాధ్యాయులు బాలకృష్ణ వివిధ ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

### భార్య ఆశ్రమంలో వున్నా

# భర్త పోషణ భృతి ఇవ్వాల్సిందే!

(కేరళ హైకోర్టు స్పష్టీకరణ)

**బద్వేలు లీగల్, అక్టోబరు 01 ప్రభాతవార్త :**

భర్త నుంచి విడిపోయి వేరుగా ఆశ్రమంలో జీవిస్తున్నంత మాత్రాన భార్యకు పోషణ భృతిని తిరస్కరించడం చెల్లనేరదని కేరళ హైకోర్టు స్పష్టం చేసింది. అభిప్రాయ భేదాల కారణంగా భర్త నుంచి విడిపోయి తన 13 సంవత్సరాల కుమార్తెతో కొల్లం జిల్లా అమృతపురి ఆశ్రమంలో నివసిస్తున్న 34 ఏళ్ళ మహిళ దాఖలు చేసిన పిటీషన్ పై హైకోర్టు ఈ తీర్పు వెలువరించింది. పోషణ నిమిత్తం నెలకు తనకు రూ.20 వేలు, తన కుమార్తెకు రూ.10 వేలు చొప్పున తన భర్త చెల్లించాలని కోరుతూ భార్య దాఖలు చేసుకున్న పిటీషన్‌ను అంతకు ముందు కుటుంబ న్యాయస్థానం (ఫ్యామిలీ కోర్టు) తోసిపుచ్చింది. ఆహారం, నివాసం, దుస్తులతో సహా అన్ని అవసరాలను ఆమె ఉంటున్న ఆశ్రమమే భరిస్తున్నందున భర్త పోషణ భృతిని చెల్లించాల్సిన అవసరం లేదు అని కుటుంబ న్యాయ స్థానం (ఫ్యామిలీ కోర్టు) పేర్కొంది. ఎం.బి.ఎ (ఫైనాన్స్), మార్కెటింగ్ చదివిన ఆమె ఇప్పుడు ఏ ఉద్యోగము చేయడం లేదని ఆశ్రమంలో తాను స్వచ్ఛంద సేవ చేస్తున్నానని కోర్టుకు తెలియజేసింది. కుటుంబ న్యాయ స్థానం తన పిటీషన్‌ను తిరస్కరించడంతో తన 40 ఏళ్ళ భర్తకు వ్యతిరేకంగా ఆమె హైకోర్టును ఆశ్రయించగా భార్య సంపాదించినంత మాత్రాన భర్త ఆమెకు పోషణ భృతిని తిరస్కరించడం కుదరదని చట్టం చెబుతున్నట్లు పిటీషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎ.బద్రుద్దీన్ తెలిపారు. భార్య సంపాదించే మొత్తం ఆమె పోషణకు సరిపోకపోతే ఆమెకు పోషణ భృతి ఇవ్వవలసిన బాధ్యత భర్తకు ఉందని కోర్టు సుస్పష్టం చేసింది. హైకోర్టు 2022 డిసెంబరు 13 తేదీన ఈ మేరకు ఈ తీర్పును వెలువరించింది. భార్య కేవలం పలు కారణాల వలన ఆశ్రమంలో ఉన్నంత మాత్రాన ఆమెకు పోషణ భృతిని తిరస్కరించడం కుదరదు. కావున ఆమెకు, ఆమె కుమార్తెకు భర్త ప్రతి నెలా పోషణ భృతిని చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది.

## గ్రామసభను విజయవంతం చేయాలి - డిఎల్‌పిఓ పార్వతి

- ప్రత్యేక ఆహ్వానితులు కలెక్టర్, మంత్రి

**లక్కిరెడ్డిపల్లె, అక్టోబర్ 01, ప్రభాతవార్త :**



మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలో గాంధీజయంతి సందర్భంగా నేడు ఉదయం 10 గంటలకు జరగబోయే గ్రామ సభను విజయవంతం చేయాలని డిఎల్‌పిఓ పార్వతి తెలిపారు. మంగళవారం గ్రామ పంచాయతీ కార్యాలయం నందు ఆమె ఎంపిడిఓ వెంకటరమణారెడ్డి, పిఓపిఆర్‌డి పట్నాయక్, అన్ని గ్రామ పంచాయతీ సెక్రెటరీలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సభను విజయవంతం చేయడానికి మండల అధికారులు అందరూ ముందుండి విజయవంతం చేయాలని సూచించారు. సబ్‌కి యోజన సబ్కా వికాస్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్, రాష్ట్ర రవాణా, యువజన క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, డిపిఓ ధనలక్ష్మి ఈ సభకు హాజరవుతున్నట్లు ఆమె తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సెక్రెటరీలు, సర్పంచులు, విద్యార్థినీ, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేసి సభను జయప్రదం చేయాలని ఆమె కోరారు. గ్రామ పంచాయతీల, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛభారత్, ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం తదితర విషయాలపై ఈ సమావేశంలో చర్చించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సెక్రెటరీ సుదర్శన్‌రెడ్డి, రెడ్డి రమణ తదితరులు పాల్గొన్నారు.

## ధైర్యం.. విజయాలకు ప్రతీక విజయదశమి

- నలంద పాఠశాలలో ముందస్తు దసరా వేడుకలు



**పులివెందుల రూరల్, అక్టోబరు 1, ప్రభాతవార్త ః**

మంచితనం, ధైర్యం, న్యాయమైన విజయానికి విజయదశమి చిహ్నంగా నిలుస్తుందని నలంద పాఠశాల కరస్పాండెంట్ వెంకటస్వామిరెడ్డి పేర్కొన్నారు. నలంద ఉన్నత పాఠశాలలో మంగళవారం దసరా ముందస్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి సాంప్రదాయబద్దంగా భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు తొమ్మిది రూపాల అమ్మవారి అలంకరణలో అద్భుతంగా ప్రదర్శనలు ఇచ్చారు. కరస్పాండెంట్ వెంకటస్వామిరెడ్డి మాట్లాడుతూ పౌరాణిక మూలాలు, ప్రాంతీయ వైవిధ్యాలకు అతీతంగా విజయదశమిని తరతరాలుగా ప్రజలతో ప్రతిధ్వనించే లోతైన ప్రతీకలను కలిగి ఉందని, విజయదశమి విశిష్టతను వివరిస్తూ విద్యార్థిని, విద్యార్థులకు ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## సైన్స్ పట్ల అవగాహన పెంచేందుకే చెకుముకి పరీక్షలు

**వేంపల్లె, అక్టోబరు 1, ప్రభాతవార్త ః**



విద్యార్థుల్లో సైన్స్‌పట్ల అవగాహన పెంచేందుకే చెకుముకి సైన్స్ టాలెంట్ పరీక్షలు నిర్వహించినట్లు జనవిజ్ఞాన వేదిక జిల్లా కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసులు, మండల శాఖ అధ్యక్షులు పి.కేశవులు తెలిపారు. వేంపల్లెలో మంగళవారం మండలస్థాయి పరీక్షలు నిర్వహించగా సుమారు 18 టీంలు పాల్గొన్నాయి. ప్రభుత్వ పాఠశాలల విభాగంలో జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటిస్థానంలోను, బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయస్థానంలోను, ఉర్దూ ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయస్థానంలోను నిలిచారు. అలాగే ప్రైవేటు పాఠశాలల విభాగంలో స్వామి వివేకానంద ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటిస్థానంలోను, శ్రీచైతన్య ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు వారు తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెడల్స్, మెమెంటోలను ఉర్దూ ఉన్నత పాఠశాల హెచ్ఎం ప్రసాద్, ఎంఈవో2 స్టాలిన్ చేతుల మీదుగా అందించారు.

## విధులకు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయుడిపై ఫిర్యాదు

**గాలివీడు, అక్టోబర్ 1(ప్రభాతవార్త):**



విధులకు డుమ్మా కొట్టిన ఉపాధ్యాయుడు బి.వెంకటేశ్వర్లుపై జిల్లా విద్యా శాఖాధికారి శివప్రకాష్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు ఎంఈఓ పిల్లి నాగరాజు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలివీడు మండలం అరవీడు గ్రామం గాండ్లపల్లి ఎంపీపీ పాఠశాలలో ఎస్జీటీ ఉపాధ్యాయుడుగా విధులు నిర్వహిస్తున్న బి.వెంకటేశ్వర్లు తరచూ పాఠశాలకు గైర్హాజరు అవ్వడంపై విద్యార్థుల తల్లిదండ్రులు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశారన్నారు. ఈ సంఘటనపై స్పందించిన ఎంఈఓ తన సిబ్బందితో కలిసి పాఠశాలను సందర్శించి, విచారించగా ఉపాధ్యాయుడిపై వచ్చిన ఆరోపణలు వాస్తవమేనని తేల్చారు. ఏడాది క్రితం తూముకుంటలో విధులు నిర్వహిస్తున్న సమయంలో కూడా తోటి ఉపాధ్యాయులతో గొడవపడేవారన్నారు. బదిలీపై గాండ్లపల్లెకు వచ్చిన సదరు ఉపాధ్యాయుడు వీలున్నపుడు పాఠశాలకు రావడం ఓ గంట కాలక్షేపం చేసి పాఠశాలకు తాళాలు వేసుకుని వెళ్లిపోవడం పరిపాటిగా మారిపోయిందన్నారు. ప్రశ్నించిన తల్లిదండ్రులను, విద్యార్థులను దుర్భాషలాడేవాడని స్థానికులు ఎంఈఓ దృష్టికి తీసుకువచ్చారు. తమ పిల్లలను స్కూల్‌కు పంపాలంటే భయం భయంగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఇదే క్రమంలో మంగళవారం ఉదయం 9 గంటలకు స్కూల్‌కు వచ్చిన ఉపాధ్యాయుడు మునుపటిలాగే తల్లిదండ్రులతో గొడవపడి పాఠశాలకు తాళాలు వేసుకుని వెళ్లిపోయాడు. జరిగిన వాస్తవాలను నివేదిక రూపంలో జిల్లా విద్యాశాఖ అధికారులకు పంపినట్లు ఎంఈఓ తెలిపారు.